TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు

# DD9 వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 76 | 29-07-2026 బుధవారం | పేజీలు: 08 | వెల: 3/-

## నిజామాబాద్ రైల్వే ప్రాజెక్టులకు పరిపాలనా అనుమతులివ్వాలి



05




# హైడ్రా సంస్కరణ కాదు..
# అరాచక సంస్థ..

### అధికారంలోకి వస్తే హైడ్రాను రద్దు చేస్తామన్న కేటీఆర్

- హైకోర్టు ఆదేశాలు ప్రభుత్వానికి చెంపపెట్టు: కేటీఆర్
- 'హైడ్రా అరాచక సంస్థ' అంటూ తీవ్ర విమర్శలు
- రేవంత్ రెడ్డి లక్ష్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఘాటు వ్యాఖ్యలు
- 'మాపైనే కేసులు, దాడులు' అంటూ కాంగ్రెస్‌పై ఆరోపణలు
- బండి సంజయ్ కుమారుడి అంశాన్ని ప్రస్తావించిన కేటీఆర్
- 'రహస్య మిత్రులు ఎవరో ప్రజలకు తెలుసు' అంటూ విమర్శలు
- రేవంత్ ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం
- ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల వర్షం
- హైడ్రా వ్యవహారం రాజకీయంగా మరింత వేడెక్కిన తెలంగాణ




**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు: 'హైడ్రా' అరాచక సంస్థ, అధికారంలోకి వస్తే బంగాళాఖాతంలో వేస్తాం! హైడ్రా (HYDRAA) వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటివని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ వేదికగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్రస్థాయిలో మిగతా 2లో..

### ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై
# రేవంత్ ఫైర్..

- ఏపీలో రూ.10 వేల కోట్ల బకాయిలు.. తెలంగాణను ప్రశ్నించే హక్కు బీజేపీకి లేదు
- ముందు ఏపీ బకాయిలు చెల్లించండి.. తర్వాత తెలంగాణను ప్రశ్నించండి
- బీఆర్ఎస్ ఎగవేతలే నేటి భారానికి కారణం
- బీజేపీ, బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు
- ఏ ఏడాది బకాయిలు ఆ ఏడాదే చెల్లిస్తామని హామీ

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల వ్యవహారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ. 10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, అక్కడ ఎన్డీఏ (NDA) ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ బిజెపి నేతలు ఎందుకు నోరు మిగతా 2లో..





02

### జార్ఖండ్‌లో మావోయిస్టులకు
# భారీ దెబ్బ

- ఒకేసారి 16 మంది లొంగుబాటు
- హింసా మార్గానికి స్వస్తి చెప్పిన నేతలు
- పునరావాస పథకాలకు ఆకర్షితులైన సభ్యులు
- లొంగిపోయిన వారిలో ఆరుగురు కీలక నేతలు
- రూ. 39 లక్షల భారీ రివార్డు కలిగిన కేడర్లు
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి పునరావాసం




### మోదీ వీడియో తొలగింపుపై
# మెటా క్షమాపణ

- సాంకేతిక పొరపాటేనని స్పష్టత
- కేంద్రం సమన్లతో క్షమాపణలు
- నీట్ అక్రమాలపై ప్రధాని సందేశం
- ఫేస్‌బుక్ వేదికగా యువతకు హామీ
- పేపర్ లీకేజీలపై కఠిన చట్టాలు
- మోదీ ప్రసంగంలో కీలక అంశాలు

02

## రైతు నేస్తంతో రైతుల చెంతకు సాంకేతికత

- సచివాలయంలో 100వ ఎపిసోడ్ సంబరాలు
- మంత్రులు, అధికారుల సమక్షంలో వేడుకలు
- దేశంలోనే తొలి డిజిటల్ వేదిక
- 1600 రైతు వేదికల ద్వారా లక్షలాది మందికి అనుసంధానం
- ఎల్-నినో సవాళ్లకు కంటింజెన్సీ ప్రణాళిక
- రైతులకు నిరంతరం తోడ్పాటునందిస్తామన్న సీఎస్
- ప్రతి మంగళవారం ప్రత్యక్ష సంభాషణ
- రైతు-శాస్త్రవేత్తల అనుసంధానంతో సమస్యలకు పరిష్కారం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రైతు చెంతకు నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరవేయడమే ధ్యేయంగా ప్రారంభమైన 'రైతు నేస్తం' కార్యక్రమం విజయవంతంగా 100వ ఎపిసోడ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన శతావధి ఎపిసోడ్ వేడుకలు అత్యంత ఘనంగా సాగాయి. ఈ ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, మిగతా 2లో..

# జూరాలకు కృష్ణమ్మ ఊరట



- సాగర్ ఆయకట్టు రైతుల్లో ఆందోళన
- బీఆర్ఎస్ నాటకాలపై మంత్రి వాకిటి ఫైర్
- ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు జలకళ
- ఎగువ ప్రాజెక్టుల నుంచి భారీగా వరద ప్రవాహం
- శ్రీశైలానికి నీటి విడుదల, ఎత్తిపోతల ప్రారంభం
- పెరుగుతున్న నీటి నిల్వలతో హర్షం

**జోగులాంబ గద్వాల, (డిడి9 వార్త):**

జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రముఖ నీటిపారుదల ప్రాజెక్టు అయిన ప్రియదర్శిని జూరాల జలాశయం కృష్ణా నదీ ప్రవాహంతో సంతరించుకుంది. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి ఎగువన నీటిని కిందకు విడుదల చేయడంతో జూరాల ప్రాజెక్టులోకి వరద నీరు వేగంగా వచ్చి చేరుతోంది. దీంతో జలాశయంలో నీటి మట్టం క్రమంగా పెరుగుతూ నిండు కుండలా మిగతా 2లో..

### తెలంగాణలో ఏర్పడేది
# డబుల్ ఇంజిన్ సర్కారే

- తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం అవుతోందన్న రాంచందర్ రావు
- చదువుకున్న యువత పార్టీలో చేరుతున్నారని వెల్లడి
- సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వ్యాఖ్య



02

### టెలివిజన్ అవార్డుల్లో
# తెలంగాణ ఆత్మ ప్రతిబింబించాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక సూచన
- టీవీ అవార్డుల రూపకల్పనపై మంత్రి సమీక్ష
- కమిటీ సభ్యులతో కోమటిరెడ్డి ఉన్నత స్థాయి సమావేశం
- అవార్డులకు మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు పేరు
- సీఎంతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్న మంత్రి
- తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పేలా లోగో
- మార్గదర్శకాలు: కమిటీకి కీలక ఆదేశాలు జారీ
- టీవీ రంగానికి మహిళలు, వృద్ధుల ఆదరణ
- నిష్పాక్షికంగా నిర్వహించాలని కమిటీకి సూచన

02





02

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రజావాణిని తనిఖీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్
- అర్జీదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న మంత్రి
- అధికారులతో ఫోన్లలో మాట్లాడి తక్షణ ఆదేశాలు
- భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల ఫిర్యాదులపై సమీక్ష
- ప్రవాసి ప్రజావాణిపై ప్రత్యేక దృష్టి
- విదేశాల్లో ఉన్న తెలంగాణ పౌరుల కష్టాలపై స్పందన
- శాఖల వారీగా సమస్యల పరిష్కార తీరుపై ఆరా
- నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కఠిన ఆదేశాలు

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రేవంత్ ఫైర్..

మొదటిపేజీ తరువాయి



మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం నూటికి నూరు శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించిన తర్వాతే తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు వారికి ఉంటుందని స్పష్టం చేశారు. 'నవ్వితే నాకేటి సిగ్గు' అన్నట్లుగా బీజేపీ నేతలు దిగజారి ప్రవర్తిస్తున్నారని, బీఆర్ఎస్‌కు వంతపాడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**గత ప్రభుత్వ నిర్వాకమే నేటి ఆర్థిక భారం**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఎగవేతల వల్లే ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశం నేడు పెద్ద ఆర్థిక భారంగా మారిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వం ఏకంగా రూ. 8,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెట్టి వెళ్లిందని ఆయన గుర్తుచేశారు. ఆనాడు ఈ బకాయిలపై మాట్లాడని నేతలు, నేడు రాజకీయ లబ్ధి కోసం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆర్ కృష్ణయ్య, కిషన్ రెడ్డి వంటి నేతలు ఏపీలోని బకాయిలపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు.

**ఏ ఏడాది బకాయిలు ఆ ఏడాదే చెల్లిస్తాం!**

ఇకపై ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులు, కళాశాలల యజమాన్యాలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యే లేకుండా శాశ్వత పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. ప్రతి ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును ఏ ఏడాదిది ఆ ఏడాదే క్రమం తప్పకుండా చెల్లిస్తామని స్పష్టం చేశారు. దీనికోసం ముందస్తుగా (అడ్వాన్స్‌గా) బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామని వెల్లడించారు. ఈ పథకం అమలు కోసం సంవత్సరానికి దాదాపు రూ. 2,400 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని వివరించారు.

**టీజీపీఎస్సీలో పారదర్శకత..**
**యూపీఎస్సీ తరహా నిర్వహణ**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TGPSC) పనితీరుపై మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, కమిషన్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (UPSC) తరహాలో ఎంతో పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకోకుండా ప్రతి పరీక్షను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో 'గ్లోబరీనా' వంటి వివాదాస్పద సంస్థపై అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్లే సిబిఎస్ఈలో సైతం అక్రమాలు జరిగాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం నిరుద్యోగుల ప్రయోజనాలే పరమావధిగా కట్టుదిట్టమైన పద్ధతుల్లో నియామక ప్రక్రియలను కొనసాగిస్తుందని పునరుద్ఘాటించారు.

# జార్ఖండ్‌లో మావోయిస్టులకు భారీ దెబ్బ

- **ఒకేసారి 16 మంది లొంగుబాటు**
- **హింసా మార్గానికి స్వస్తి చెప్పిన నేతలు**
- **పునరావాస పథకాలకు ఆకర్షితులైన సభ్యులు**
- **లొంగిపోయిన వారిలో ఆరుగురు కీలక నేతలు**
- **రూ. 39 లక్షల భారీ రివార్డు కలిగిన కేడర్లు**
- **ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి పునరావాసం**
- **లొంగిపోయిన వారికి ఆర్థిక నిధి, సహకారం**
- **ఛత్తీస్‌గఢ్‌లోనూ మరో ఎనిమిది మంది లొంగుబాటు**

**రాంచీ, (డిడి9 వార్త):**

జార్ఖండ్ రాజధాని రాంచీ వేదికగా మావోయిస్టుల నెట్‌వర్క్‌కు తీవ్ర విఘాతం కలిగింది. తీవ్రవాద, హింసాత్మక మార్గాన్ని వీడి, రాజ్యాంగంపై అలాగే ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకంతో ఏకంగా 16 మంది మావోయిస్టులు పోలీసు అధికారుల సమక్షంలో లొంగిపోయినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ పరిణామం జార్ఖండ్ పోలీస్ శాఖకు మరియు భద్రతా బలగాలకు లభించిన అతిపెద్ద విజయంగా అధికారులు వర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆకర్షణీయమైన పునరావాస పథకాలకు ఆకర్షితులై, శాంతియుత జీవనం గడపాలనే ఉద్దేశంతోనే మావోయిస్టులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. భద్రతా బలగాలు నిరంతరం చేపడుతున్న వ్యూహాత్మక ఆపరేషన్లు, పెట్రోలింగ్, నిఘా చర్యల వల్ల ఒత్తిడి పెరిగి మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి వస్తున్నారని అధికారులు తెలిపారు.

ఇప్పుడు లొంగిపోయిన 16 మంది మావోయిస్టులలో ఆరుగురు అత్యంత కీలక స్థానాల్లో ఉన్న అగ్రనేతలు కావడం విశేషం. ఈ ఆరుగురిపై ప్రభుత్వం గతంలోనే రూ. 39 లక్షల మేర భారీ రివార్డులను ప్రకటించి ఉంది. తీవ్రమైన నేర విచారణలు, అనేక రకాల హింసాత్మక ఘటనలు మరియు దాడులలో వీరికి ప్రత్యక్ష ప్రమేయం ఉన్నట్లు పోలీసుల రికార్డులు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలు, లొంగివేత విధానాలకు అనుగుణంగా ఆయుధాలు త్యజించిన మావోయిస్టులందరికీ తగిన పునరావాస సదుపాయాలు కల్పిస్తామని సీనియర్ పోలీస్ అధికారులు ప్రకటించారు. వారికి తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు సమాజంలో శాంతియుతంగా, గౌరవప్రదంగా జీవించేందుకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. పొరుగు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లో కూడా మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలిందని, అక్కడ మరో ఎనిమిది మంది మావోయిస్టులు లొంగిపోయారని జార్ఖండ్ పోలీస్ ఐజీ (ఆపరేషన్స్) నరేంద్ర కుమార్ సింగ్ మీడియాకు వివరించారు. లొంగిపోయిన ఈ బృందంలో రూ. 15 లక్షల భారీ రివార్డు కలిగిన ఒక కీలకమైన కేంద్ర కమిటీ సభ్యుడు కూడా ఉన్నారని ఆయన వెల్లడించారు. తాజాగా లొంగిపోయిన వారి జాబితాలో ముగ్గురు జోనల్ కమిటీ సభ్యులు, ముగ్గురు సబ్‌జోనల్ కమిటీ సభ్యులు మరియు ఆరుగురు ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారని ఐజీ తెలిపారు. సంస్థలో కీలక బాధ్యతలు నిర్వహించే స్థానిక, ప్రాంతీయ నేతలు ఇలా పెద్ద సంఖ్యలో బయటకు రావడం వల్ల సాయుధ మావోయిస్టు నెట్‌వర్క్ ఆ ప్రాంతంలో దాదాపు కూలిపోయిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈ రోజు జార్ఖండ్ పోలీసుల చరిత్రలోనే ఒక గుర్తుండిపోయే రోజు అని, ఇది పోలీసు శాఖ సాధించిన మహత్తర విజయమని ఐజీ నరేంద్ర కుమార్ సింగ్ కొనియాడారు. రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు దాదాపుగా అంతమొందించబడ్డాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నిరంతర ఆపరేషన్ల వల్ల విద్రోహ శక్తుల బలం పూర్తిగా క్షీణించిందని చెప్పారు. ఇంకా అక్కడక్కడా కొందరు మావోయిస్టులు చురుకుగా ఉంటూ అటవీ ప్రాంతాల్లో కదలికలు సాగిస్తున్నారని, వారి ఆచూకీ కోసం భద్రతా బలగాలు నిరంతర శోధన చర్యలు (కూంబింగ్) కొనసాగిస్తున్నాయని ఐజీ స్పష్టం చేశారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే లొంగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు. లొంగిపోని పక్షంలో పోలీసు ఎదురుకాల్పులు, వ్యూహాత్మక ఆపరేషన్ల సమయంలో ప్రాణాలు కోల్పోక తప్పదని హెచ్చరించారు.




# మోదీ వీడియో తొలగింపుపై మెటా క్షమాపణ

- **సాంకేతిక పొరపాటేనని స్పష్టత**
- **కేంద్రం సమన్లతో క్షమాపణలు**
- **నీట్ అక్రమాలపై ప్రధాని సందేశం**
- **ఫేస్‌బుక్ వేదికగా యువతకు హామీ**
- **పేపర్ లీకేజీలపై కఠిన చట్టాలు**
- **మోదీ ప్రసంగంలో కీలక అంశాలు**
- **జులై 28న కొద్దిసేపు నిలిచిపోయిన వీడియో**
- **తీవ్రంగా పరిగణించిన కేంద్ర ప్రభుత్వం**

**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేసిన ఒక వీడియోను కొద్దిసేపు తొలగించిన వివాదంపై ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం మెటా సంస్థ కేంద్ర ప్రభుత్వానికి క్షమాపణలు తెలిపింది. ప్రధాని వీడియోను తాము ఉద్దేశపూర్వకంగా తొలగించలేదని, కేవలం సాంకేతిక లోపం వల్లే ఈ పొరపాటు జరిగిందని మెటా ప్రతినిధి స్పష్టం చేశారు. ఐటీ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన తీవ్ర ఆదేశాల అనంతరం సదరు వీడియోను పునరుద్ధరించి, మళ్లీ అందరికీ కనిపించేలా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు.

నీట్‌యూజీ 2026 పరీక్షల్లో జరిగిన అక్రమాలపై క్రాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలో విద్యార్థులు దేశవ్యాప్తంగా సుదీర్ఘ నిరసనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జులై 23న ప్రధాని మోదీ ఫేస్‌బుక్ వేదికగా మొదటిసారిగా నేరుగా యువతను (జెన్‌జీ) ఉద్దేశించి ప్రసంగించారు. ఈ వీడియో సందేశంలో పరీక్ష పేపర్ లీకేజీలకు పాల్పడే నేరస్థులపై ప్రభుత్వం అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటుందని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు బలమైన హామీ ఇచ్చారు.

తన ప్రసంగంలో ప్రధాని మాట్లాడుతూ, పేపర్ లీక్ కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కఠిన నిబంధనలతో కూడిన ముసాయిదా చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు కేబినెట్‌లో చర్చిస్తామన్నారు. దేశంలోని 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు, విద్యా సంవత్సరం వృథా కాకుండా చూడడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని మోదీ ఆ వీడియోలో పేర్కొన్నారు. అయితే జులై 28న తెల్లవారుజామున ఈ వీడియో యాక్సెస్ కొద్దిసేపు నిలిచిపోవడంతో ఫేస్‌బుక్‌లో ప్రధాని పోస్ట్ కనిపించకుండా పోయింది. దేశ ప్రధాని అధికారిక వేదికగా చేసిన పోస్ట్ మాయమవ్వడాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. వీడియోను ఎందుకు తొలగించారో వివరణ ఇవ్వాలంటూ మెటా గ్లోబల్ పబ్లిక్ పాలసీ హెడ్‌కు కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ తక్షణమే సమన్లు జారీ చేసింది. దీంతో దిగివచ్చిన మెటా ప్రతినిధి స్పందిస్తూ, ప్రధాని వీడియో తొలగింపు పొరపాటున జరిగిందని, దానిని వెంటనే పునరుద్ధరించామని ప్రకటన విడుదల చేశారు.

జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో వారి డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేసింది. ఇందులో భాగంగానే సోమవారం పార్లమెంట్‌లో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్లు, 2026'ను ప్రవేశపెట్టింది. ఈ ప్రతిపాదిత కొత్త చట్టం ప్రకారం పరీక్షల అక్రమాలకు పాల్పడే నిందితులకు 10 ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటు భారీ జరిమానాలు విధిస్తారు. కేసుల వేగవంతమైన విచారణకు ప్రత్యేక కోర్టులు పనిచేస్తాయి. మరోవైపు 'నీట్' ఆందోళనల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం ఉల్లంఘించిందని క్రాక్రోచ్ జనతా పార్టీ తీవ్ర ఆరోపణలు చేసింది. సోమవారం సీజేపీ ప్రతినిధి ఆశుతోష్ రాంకా సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌లను ప్రశ్నించారు. నిరసనలు తెలిపిన విద్యార్థులపై ఎలాంటి పోలీసు చర్యలు తీసుకోమని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ మాట తప్పిందని విమర్శించారు.

ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని ఆశుతోష్ రాంకా డిమాండ్ చేశారు. బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో వందలాది మంది విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, ఢిల్లీ సహా ఇతర ప్రాంతాల్లో ఆందోళనలకు మద్దతు ఇచ్చిన వాలంటీర్లను వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే మళ్లీ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ప్రశాంతంగా ఆందోళనలు చేసిన యువతపై నమోదు చేసిన అన్ని ఎఫ్ఐఆర్‌లను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సీజేపీ డిమాండ్ చేసింది. భవిష్యత్తులో కూడా నిరసనకారులపై ఎలాంటి కొత్త కేసులు నమోదు చేయబోమని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా లిఖితపూర్వక హామీ ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ తీరును ఎండగడుతూ, విద్యార్థుల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని సీజేపీ నాయకులు పునరుద్ఘా

# జూరాలకు కృష్ణమ్మ ఊరట

మొదటిపేజీ తరువాయి

మారుతోంది. జూరాల ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా, ప్రస్తుతం నీటి మట్టం 8.989 టీఎంసీలకు చేరుకుందని నీటిపారుదల శాఖ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి జూరాల జలాశయానికి సుమారు 29,668 క్యూసెక్కుల నీటి ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. జలాశయంలో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరువకావడంతో, వచ్చిన నీటిలో 27,210 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. అంతేకాకుండా, పరివాహక ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాల కోసం నెట్టెంపాడు మరియు కోయిల్‌సాగర్ రిజర్వాయర్లకు ఎత్తిపోతల పథకాల (లిఫ్ట్ ఇరిగేషన్) ద్వారా నీటిని తోడే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు.

మరోవైపు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇటీవల కర్ణాటకలోని గూడూరు ప్రాంతాన్ని సందర్శించి కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలను రాష్ట్ర క్రీడలు, పశుసంవర్ధక శాఖల మంత్రి వాకిటి శ్రీహరి తీవ్రంగా ఖండించారు. కృష్ణా నది జలాల నిర్వహణ మరియు పరిరక్షణపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకి లేదని ఆయన మండిపడ్డారు. గత పదేళ్ల తమ పాలనా కాలంలో కర్ణాటక ప్రభుత్వం అక్రమంగా డ్యాంలు నిర్మిస్తుంటే ఎందుకు ప్రశ్నించలేదని సభ వేదికగా నిలదీశారు.

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలోని రైతుల ప్రయోజనాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని మంత్రి వాకిటి శ్రీహరి ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా, భీమా నదుల నీటిని సమర్థవంతంగా నిల్వ చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలనే కనీస ఆలోచన కూడా గత పాలకులకు లేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోందని, కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి కృష్ణా, భీమా నదులపై బ్యారేజీకమ్‌బ్రిడ్జిల నిర్మాణానికి అవసరమైన నివేదికలను సిద్ధం చేశామని తెలిపారు.

జూరాల ప్రాజెక్టు పరిధిలోని భూత్పూర్, అంకెనపల్లి, దాదంపల్లి, నేడుగం, అనుగొండ వంటి ముంపు గ్రామాల ప్రజల సమస్యలను గత ప్రభుత్వం దశాబ్ద కాలంగా పట్టించుకోలేదని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా గ్రామాల అభివృద్ధి, పునరావాస ప్యాకేజీలు మరియు భూత్పూర్ డ్యాం విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టిందని వివరించారు. పాలమూరు ప్రజల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే, బీఆర్ఎస్ నేతలు ప్లకార్డులు పట్టుకుని డ్రామాలు చేస్తున్నారని, వారిని ప్రజలు ఇక నమ్మరని స్పష్టం చేశారు.

జూరాల పరిధిలో జలకళ కనిపిస్తున్నప్పటికీ, మరోవైపు నాగార్జునసాగర్ ఆయకట్టు రైతులు మాత్రం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం పూర్తి నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం కేవలం 513.10 అడుగులు మాత్రమే ఉంది. ఇది దాదాపు డెడ్ స్టోరేజ్ (నీటిని వాడుకోలేని కనిష్ఠ స్థాయి)కి చేరువలో ఉందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. నాగార్జునసాగర్ జలాశయం మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 136 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది.

ప్రస్తుతం సాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి కేవలం 900 క్యూసెక్కుల నీరు మాత్రమే ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతోంది. అంతే మొత్తంలో అంటే 900 క్యూసెక్కుల నీటిని హైదరాబాద్ మహానగర తాగునీటి అవసరాల కోసం ఔట్‌ఫ్లోగా విడుదల చేస్తున్నారు. జలాశయంలో నీటి నిల్వలు అట్టడుగుకు చేరడం మరియు ఇన్‌ఫ్లో కూడా నామమాత్రంగా ఉండటంతో పంటలకు నీరు విడుదల చేసే పరిస్థితి కనిపించడం లేదని ఆయకట్టు రైతులు కలవరపడుతున్నారు. ఈ ఏడాది ఏర్పడిన ఎల్‌నినో ప్రభావం వల్ల ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో నాగార్జునసాగర్ ఆయకట్టు కింద పంటలకు సాగునీరు అందుతుందో లేదోనని రైతులు దిగులు చెందుతున్నారు. గతేడాది జూలై చివరి నాటికి ఎగువన వర్షాలు సమృద్ధిగా కురిసి నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసిన విషయాన్ని ఈ సందర్భంగా రైతులు గుర్తుచేసుకుంటున్నారు. కాగా, ఎగువన వర్షాలు పడి ఆయకట్టును ఆదుకునేలా కృష్ణమ్మ శాంతించాలని సాగుదారులు దేవుడిని వేడుకుంటున్నారు.

# హైడ్రా సంస్కరణ కాదు.. అరాచక సంస్థ..

మొదటిపేజీ తరువాయి



విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి కేసులు పెట్టేది, దాడులు చేసేది తమపైనేనని మండిపడ్డారు. బండి సంజయ్ కొడుకును రేవంత్ రెడ్డి కాపాడారని, ఎవరికి ఎవరు రహస్య మిత్రులో ప్రజలందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వంపై ఎంత ఒత్తిడి తెచ్చినా రేవంత్ రెడ్డితో తాము నిరంతరం తలపడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

**హైడ్రా ఒక బ్లాక్‌మెయిల్ టూల్..**

హైడ్రా అనేది సంస్కరణ కాదని, అదొక అరాచక సంస్థ అని కేటీఆర్ ధ్వజమెత్తారు. బిల్డర్లను బ్లాక్‌మెయిల్ చేయడానికి, ఆర్ఆర్ టాక్స్ పేరుతో డబ్బులు గుంజడానికి రేవంత్ రెడ్డి హైడ్రాను ఒక టూల్‌లా ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వసూలు చేస్తున్న ఈ డబ్బులు చివరకు బిఆర్ఎస్ , కాంగ్రెస్ ఖాతాలకే వెళ్తున్నాయని విమర్శించారు. సీఎం సోదరుడి ఇల్లు, ఇతర మంత్రుల ఇళ్లు చెరువుల్లో ఉన్నప్పటికీ వాటిని ముట్టడం లేదని, కేవలం పేదలనే హైడ్రా టార్గెట్ చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం అన్నదమ్ములే పెద్ద కబ్జాకోరులని, భూమిని భూహారతిగా మింగేస్తున్నారని తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని, చట్టానికి ఎవరూ మినహాయింపు కాకూడదని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి తెచ్చే ప్రతి స్కీమ్ వెనుక ఒక స్కామ్ ఉంటుందని, తాము అధికారంలోకి వచ్చాక హైడ్రాను బంగాళాఖాతంలో పడేస్తామని తేల్చి చెప్పారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్, అప్పులపై స్పష్టత**

2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పుడు కూడా గత ప్రభుత్వాల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని కేటీఆర్ గుర్తుచేశారు. ఆనాడు తాము రూ. 72 వేల కోట్ల అప్పులతో పాలన మొదలుపెట్టి, రూ. 2 లక్షల కోట్ల వరకు అప్పు చేశామని, అయితే దానికి తగ్గట్టుగానే రాష్ట్రంలో ఆస్తులను కూడా భారీగా పెంచామని వివరించారు. కొత్తగా భవనాలు లేదా ఇళ్లు ఏవీ నిర్మించకుండా, కేవలం పేర్లు మార్చి రేవంత్ రెడ్డి ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని ఎద్దేవా చేశారు.

**కేంద్ర మంత్రితో భేటీ – రైల్వే, ఐటీ రంగాల వినతులు**

రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రజల బాగుగోల్లే తమకు ముఖ్యమని కేటీఆర్ స్పష్టం చేశారు. కేంద్ర రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమై రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించినట్లు వెల్లడించారు. సౌత్ రైల్వే జోన్ పునర్విభజనలో భాగంగా వరంగల్ ప్రజల సుదీర్ఘ కోరిక అయిన కాజీపేట రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే హైదరాబాద్‌కరీంనగర్ (మనోహరాబాద్‌కొత్తపల్లి) లైన్‌లో సిద్దిపేట వరకు రైల్వే లైన్ పూర్తయిందని, మిగిలిన 75 కిలోమీటర్ల లైన్‌ను త్వరగా పూర్తి చేయాలని విన్నవించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సహాయ నిరాకరణ వల్లే ఈ పనులు ఆగాయని, ఈ ప్రాధాన్యత గల లైన్‌కు నిధులు ఇవ్వాలని కోరారు. దీనితో పాటు సిరిసిల్ల, వేములవాడ రైల్వే స్టేషన్లను 'అమృత్ స్టేషన్లు'గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు.

ఐటీ రంగం అభివృద్ధి గురించి మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో ద్వితీయ శ్రేణి నగరాల్లోని 10 ప్రాంతాల్లో నిర్మించిన ఐటీ హబ్‌లు నేడు కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల భూత్ బంగ్లాల్లా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్లలో ఐటీ ఉద్యోగాల వృద్ధి మందగించిందని, తమ పాలన ముగిసేనాటికి ఉన్న ఉద్యోగాల్లో దాదాపు 7,000 ఉద్యోగాలు తగ్గాయని తెలిపారు. వరంగల్‌లో 'ఇండియా AI డేటా సెంటర్', కరీంనగర్, ఖమ్మంలో సైబర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు వెల్లడించారు.

**దేశవ్యాప్త యువత నిరాశ, ఉద్యోగాలపై ప్రశ్నలు**

ఏ రాజకీయ పార్టీ అండ లేకుండా దేశంలో యువత తిరుగుబాటు జెండా ఎగురవేస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారని, మరి గత 12 ఏళ్లలో రావాల్సిన 24 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ పోయాయని ప్రశ్నించారు. ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ తీవ్ర అసమర్థత వల్లే యువత ఆందోళనలను సరిగ్గా అడ్రస్ చేయలేకపోయిందని, ఆన్‌లైన్‌లో మొదలైన ఉద్యమం చివరికి ఉద్రిక్తంగా మారిందని అన్నారు. దేశంలోని యువతలో ప్రస్తుతం తీవ్ర నిరాశా నిస్పృహలు నిండి ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# రైతు నేస్తంతో రైతుల చెంతకు సాంకేతికత

మొదటిపేజీ తరువాయి

వ్యవసాయ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, ఉన్నతాధికారులు మరియు పలు జిల్లాలకు చెందిన ఆదర్శ రైతులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1600 రైతు వేదికలలో డిజిటల్ వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించి, రైతులను నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో అనుసంధానించిన కార్యక్రమం దేశంలోనే ఇది మొదటిదని మంత్రి తుమ్మల వెల్లడించారు. 2024 మార్చి 6న ప్రారంభమైన ఈ వేదిక ద్వారా ఇప్పటివరకు 27.30 లక్షలకు పైగా రైతులు ప్రయోజనం పొందారని చెప్పారు. ప్రత్యక్షంగా పాల్గొన్న రైతులలో 5.26 లక్షలకు పైగా మహిళా రైతులు ఉండడం విశేషం. గతంలో నిరుపయోగంగా మారిన రైతు వేదికలను నాలెడ్జ్ హబ్‌లుగా మార్చడంలో ఈ కార్యక్రమం విజయం సాధించిందన్నారు.

కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ.. రైతు నేస్తం శతావధి ఎపిసోడ్ మైలురాయిని చేరుకోవడంలో కీలక పాత్ర పోషించిన రైతులు, శాస్త్రవేత్తలు మరియు అధికారులను అభినందించారు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ సిద్ధం చేసిన కంటింజెన్సీ ప్రణాళిక ప్రకారం రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు, తదితర మద్దతును అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రతి వారంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించే రైతు నేస్తం లైవ్ కార్యక్రమంలో రైతులు అడిగే ప్రశ్నలకు శాస్త్రవేత్తలు వెంటనే సమాధానాలు అందిస్తున్నారు. పంటలు తెగుళ్ల బారిన పడకముందే తగిన నివారణ చర్యలు తీసుకునేందుకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతోందని అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్య ఎదురైన వెంటనే నిపుణుల సలహా అందడం వల్ల రైతులకు నష్టాలు తగ్గుతున్నాయని మంత్రులు వివరించారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం జూలై నెలలో 218 మిమీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 150 మిమీ మాత్రమే కురిసి 27 శాతం వర్షపాత లోటు ఏర్పడిందని మంత్రి తుమ్మల వెల్లడించారు. రానున్న రోజుల్లో ఉత్తర తెలంగాణలో అల్పపీడన వర్షాలు కురిసినప్పటికీ, ఇవి ప్రాజెక్టులు నిండటానికి లేదా భూగర్భ జలాలు పెరగడానికి సరిపోవని స్పష్టం చేశారు. కాబట్టి రైతులు కేవలం వర్షాలను చూసి ఎక్కువ నీరు అవసరమయ్యే వరి పంటపైనే ఆధారపడకుండా, ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు, ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు మరియు యుద్ధ పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపుతున్న తరుణంలో, రైతు సాంకేతికంగా మారాల్సిన అవసరం ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. భూగర్భ జలాల పరిస్థితిని బట్టి ప్రాంతాల వారీగా ఏ పంటలు అనుకూలమో శాస్త్రవేత్తల సూచనల మేరకు మాత్రమే నిర్ణయించుకోవాలని పిలుపునిచ్చారు. రైతును ఆర్థికంగా బలోపేతం చేసి రాజుగా మార్చడమే ప్రభుత్వం మరియు రైతు నేస్తం యొక్క అంతిమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ 100వ ఎపిసోడ్ సందర్భంగా పలు జిల్లాల నుంచి వచ్చిన ఆదర్శ రైతులు తమ సాగు అనుభవాలను సభతో పంచుకున్నారు. ఖమ్మం, జగిత్యాల, నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్ జిల్లాల రైతులు మాట్లాడుతూ.. రైతు నేస్తం ద్వారా లభించే సూచనలు తమకు ఎంతగానో ఉపకరిస్తున్నాయని తెలిపారు. బోర్ల కింద ఆయిల్ పామ్, బోడ కాకర, ప్రకృతి వ్యవసాయం చేస్తూ తక్కువ నీటితో అధిక దిగుబడి, లక్షల్లో ఆదాయం పొందుతున్న విధానాలను ఇతర రైతులకు వివరించారు. కార్యక్రమం ముగింపు ఘట్టంలో, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆదర్శ రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరియు అధికారులు వేదికపై శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

## తెలంగాణలో ఏర్పడేది డబుల్ ఇంజిన్ సర్కారే

- **తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం అవుతోందన్న రాంచందర్ రావు**
- **చదువుకున్న యువత పార్టీలో చేరుతున్నారని వెల్లడి**
- **సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వ్యాఖ్య**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ నేతృత్వంలో 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' ఏర్పాటు కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం కావడం శుభపరిణామమని, చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో పార్టీలోకి చేరుతుండటం మార్పుకు సంకేతమని పేర్కొన్నారు.
సనాతన ధర్మాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న ఆయన... అనేక దేశాలు క్రిస్టియన్, ముస్లిం దేశాలుగా మారినా సనాతన ధర్మాన్ని ఏ శక్తీ నిర్మూలించలేకపోయిందని అన్నారు. ప్రస్తుతం యువజన ఉద్యమాల ముసుగులో విదేశీ నిధులు సేకరిస్తూ దేశాన్ని విభజించేందుకు కొన్ని కుట్రలు సాగుతున్నాయని, దేశ సమగ్రతను కాపాడుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. ఇది ప్రతి పదేళ్లకు ఒకసారి సాధారణంగా జరిగే ప్రక్రియ మాత్రమేనని, దీనిని అడ్డుపెట్టుకుని అనవసర భయాందోళనలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో ఎలాంటి ఒడిదుడుకులను సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.



## లయన్స్ కంటి ఆసుపత్రికి రూ.10 లక్షల విరాళం

- **ఉదారత చాటుకున్న ఎన్ఆర్ఐ డాక్టర్ రవీందర్ రెడ్డి**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూలై 28 (డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణం రాకాసిపేట్‌లోని లయన్స్ కేవీరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కంటి ఆసుపత్రికి ఎన్.ఆర్.ఐ. డాక్టర్ రవీందర్ రెడ్డి రూ.10 లక్షల భారీ విరాళాన్ని అందించి తమ ఉదారతను చాటుకున్నారు. మంగళవారం ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన బంధువు ప్రభు రెడ్డి చేతుల మీదుగా రూ.10 లక్షల చెక్కును ఆసుపత్రి నిర్వాహకులకు అందజేశారు. గతంలోనూ ఈ ఆసుపత్రి వికాసానికి ఆర్థిక సాయం అందించిన డాక్టర్ రవీందర్ రెడ్డి, ఇటీవల ఆసుపత్రిని వ్యక్తిగతంగా సందర్శించారు. అక్కడ నెలకొన్న పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న ఉచిత/స్వల్ప రుసుము వైద్య సేవలు, అత్యాధునిక పరికరాలతో శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్న తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ యాజమాన్యాన్ని అభినందించారు. పేద రోగులకు అత్యాధునిక కంటి వైద్య సేవలు మరింత చేరువయ్యేలా రూ.10 లక్షల విరాళం ప్రకటించిన డాక్టర్ రవీందర్ రెడ్డికి, వారి కుటుంబ సభ్యులకు లయన్స్ ట్రస్ట్ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వ్యవస్థాపకులు బసవేశ్వర్ రావు, లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ నరసింహారెడ్డి, ఉమేష్ శిండే తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం.. ఇందిరమ్మ ఇళ్లు

- **27 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాల అందజేత**

**నిజామాబాద్ జిల్లా, జూలై 28 (డీడీ9 వార్త) :**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఒక వరమని భీంగల్ ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్ పేర్కొన్నారు. భీంగల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 27 మంది నిరుపేద లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో మొదటి దశ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయడంతో, జిల్లా కలెక్టర్ అదనంగా మరో 27 ఇళ్లను మంజూరు చేశారని తెలిపారు. లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జనార్ధన్, ఆయా గ్రామాల సర్పంచులు, హౌసింగ్ ఏఈ తేజస్, ఏపీఓ నర్సయ్య, ఏపీఎం ప్రమీల, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ప్రిన్స్ తదితరులు పాల్గొన్నారు.



## మిరాకిల్ మైండ్స్ పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు

**నిజామాబాద్ జిల్లా, జూలై 28 (డీడీ9 వార్త) :**



వర్ని మండల కేంద్రంలోని మిరాకిల్ మైండ్స్ పాఠశాలలో ఆషాఢ మాస బోనాల పండుగను మంగళవారం సంప్రదాయబద్ధంగా, అత్యంత వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు తెలంగాణ సంస్కృతి, ఆచార వ్యవహారాలు ప్రతిబింబించేలా ప్రదర్శించిన రీతులు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, భక్తిశ్రద్ధలతో బోనాలను శిరస్సుపై ఎత్తుకుని అమ్మవారికి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. దీంతో పాఠశాల ఆవరణమంతా ఆధ్యాత్మిక శోభతో పాటు పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ వినోద్ మాట్లాడుతూ.. బోనాలు తెలంగాణ వైభవానికి, సంస్కృతికి నిలువెత్తు ప్రతీక అని పేర్కొన్నారు. నేటి భావి తరాలకు మన ఆచారాలు, పండుగల విశిష్టతను పరిచయం చేయాలనే సదుద్దేశంతోనే ప్రతి ఏటా తమ పాఠశాలలో బోనాల వేడుకలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను దిగ్విజయం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- **ప్రజావాణిని తనిఖీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్**
- **అర్జీదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న మంత్రి**
- **అధికారులతో ఫోన్లలో మాట్లాడి తక్షణ ఆదేశాలు**
- **భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల ఫిర్యాదులపై సమీక్ష**
- **ప్రవాసి ప్రజావాణిపై ప్రత్యేక దృష్టి**
- **విదేశాల్లో ఉన్న తెలంగాణ పౌరుల కష్టాలపై స్పందన**
- **శాఖల వారీగా సమస్యల పరిష్కార తీరుపై ఆరా**
- **నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కఠిన ఆదేశాలు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రంలోని ప్రజల సమస్యలకు అత్యంత వేగవంతంగా మరియు పారదర్శకంగా పరిష్కారం అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి, బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఆయన స్వయంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి వినతిపత్రాలను మంత్రి స్వయంగా స్వీకరించి వారి సమస్యలను ఓపికగా విన్నారు.ప్రజావాణికి వచ్చిన వినతులను పరిశీలించిన అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ అక్కడికక్కడే సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఫోన్లలో నేరుగా మాట్లాడి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా భూ సంబంధిత వివాదాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, 2బీహెచ్‌కే గృహాలు, రెవెన్యూ, మున్సిపల్ మరియు సంక్షేమ శాఖలకు సంబంధించిన దరఖాస్తులపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి పేద దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు.
విదేశాల్లో ఉపాధి, ఉద్యోగాలు లేదా ఇతర కారణాల వల్ల రకరకాల కష్టాలు, సమస్యలు ఎదుర్కొంటున్న తెలంగాణ నివాసితుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 'ప్రవాసి ప్రజావాణి' అర్జీలను కూడా మంత్రి ప్రత్యేకంగా పరిశీలించారు. విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న మన వారి దరఖాస్తులను విదేశాంగ మరియు ఇతర సంబంధిత శాఖల సమన్వయంతో వీలైనంత వేగంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని నోడల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రజావాణి వేదికగా ప్రజల నుంచి ప్రతిరోజూ అందుతున్న అర్జీల సంఖ్య, వాటి పరిష్కార నిష్పత్తి, శాఖల వారీగా అధికారులు తీసుకుంటున్న చర్యలపై మంత్రి సమగ్ర విచారణ జరిపారు. ప్రజా భవన్‌కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, ప్రతి వినతిని ఎంతో బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగానే సమస్యను పరిష్కరించి బాధితులకు సమాచారం అందించాలని కఠినంగా ఆదేశించారు.
ఈ తనిఖీ కార్యక్రమంలో భాగంలో తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి విద్యాసాగర్‌లతో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రజావాణి నిర్వహణ పద్ధతులు, ప్రజల నుంచి వస్తున్న స్పందన మరియు ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక, పరిపాలనాపరమైన అంశాలపై చర్చించి, అవసరమైన సూచనలు అందించారు.ప్రజల అర్జీలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతా అంశంగా భావిస్తోందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ప్రజావాణి ద్వారా దాఖలయ్యే ప్రతి వినతిపత్రానికి ఎలాంటి అవినీతి, జాప్యం లేకుండా పారదర్శకంగా, త్వరితగతిన పరిష్కారం అందేలా చూడటానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పునరుద్ఘాటించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.
జిల్లాల్లోని క్షేత్రస్థాయి అధికారులు ప్రజావాణికి వచ్చే వినతులపై త్వరితగతిన స్పందించాలని మంత్రి ఆదేశించారు. కేవలం వినతులు స్వీకరించడమే కాకుండా, సమస్యల తీవ్రతను బట్టి వెంటనే విచారణ చేపట్టి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శాఖలో ప్రజావాణి అర్జీల పురోగతిని సమీక్షించడానికి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న పారదర్శక చర్యల వల్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందని, సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే రీతిలో బాధితులకు అండగా నిలుస్తూ ప్రజా సమక్షంలోనే పాలన సాగిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# టెలివిజన్ అవార్డుల్లో తెలంగాణ ఆత్మ ప్రతిబింబించాలి

- **మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక సూచన**
- **టీవీ అవార్డుల రూపకల్పనపై మంత్రి సమీక్ష**
- **కమిటీ సభ్యులతో కోమటిరెడ్డి ఉన్నత స్థాయి సమావేశం**
- **అవార్డులకు మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు పేరు**
- **సీఎంతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్న మంత్రి**
- **తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పేలా లోగో**
- **మార్గదర్శకాలు: కమిటీకి కీలక ఆదేశాలు జారీ**
- **టీవీ రంగానికి మహిళలు, వృద్ధుల ఆదరణ**
- **నిష్పాక్షికంగా నిర్వహించాలని కమిటీకి సూచన**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించతలపెట్టిన టెలివిజన్ (టీవీ) అవార్డుల రూపకల్పన, అవసరమైన మార్గదర్శకాలు, లోగో మరియు అవార్డుల పేర్ల ఎంపికపై సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) మేనేజింగ్ డైరెక్టర్ ముకుంద రెడ్డి, టెలివిజన్ అవార్డుల కమిటీ చైర్మన్, సభ్యులు మరియు సంబంధిత ఉన్నతాధికారులు పాల్గొని వివిధ అంశాలపై విస్తృతంగా చర్చించారు.
రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ఇవ్వనున్న ఈ టెలివిజన్ అవార్డులకు బహుభాషా కోవిదుడు, దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ పి.వి. నరసింహారావు పేరును పెట్టాలని కమిటీ సభ్యులు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనపై మంత్రి స్పందిస్తూ.. పి.వి. నరసింహారావు వంటి మహోన్నత వ్యక్తుల పేర్లను పరిశీలించడంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు.
టెలివిజన్ అవార్డులకు సంబంధించిన విధివిధానాలు, నిబంధనలు, లోగో మరియు అవార్డుల పేర్ల నివేదికను వీలైనంత త్వరగా సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని కమిటీని మంత్రి ఆదేశించారు. రూపొందించే అవార్డుల పేరు మరియు లోగో తెలంగాణ రాష్ట్ర ఆత్మను, స్థానిక సంస్కృతిని, ప్రాంతీయ విశిష్టతను మరియు ప్రత్యేకతను స్పష్టంగా ప్రతిబింబించేలా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.సమీక్షా సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో టెలివిజన్ రంగం ప్రజలకు అత్యధిక వినోదాన్ని అందించే ప్రధాన మాధ్యమంగా మారిందన్నారు. ముఖ్యంగా గృహిణులు, మహిళలు మరియు వృద్ధులు ప్రతిరోజూ టెలివిజన్ కార్యక్రమాలు, సీరియళ్లు చూడటానికి విశేష ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఇంటా టీవీ రంగం భాగమైపోయిందని అభిప్రాయపడ్డారు. టెలివిజన్ రంగంలో తమ ప్రతిభను చాటుకుంటున్న నటీనటులు, ఇతర కళాకారులు మరియు వెనక ఉండి పనిచేసే సాంకేతిక నిపుణులను (టెక్నీషియన్లు) ప్రోత్సహించేందుకే ఈ అవార్డులను తీసుకువస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. సమాజానికి మంచి సందేశాలను ఇచ్చే సీరియళ్లు, ప్రత్యేక కార్యక్రమాలు, నాణ్యమైన కంటెంట్‌తో పాటు బాలల చిత్రాలను రూపొందించే ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లను గౌరవించేలా ఈ అవార్డులను తీర్చిదిద్దుతామన్నారు.రాష్ట్ర అవతరణ తర్వాత మొదటిసారిగా ప్రదానం చేయనున్న ఈ టెలివిజన్ అవార్డులను అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రీతిలో నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అవార్డు గ్రహీతల ఎంపిక ప్రక్రియ ఎలాంటి విమర్శలకు తావులేకుండా, అత్యంత పారదర్శకంగా మరియు నిష్పాక్షికంగా జరగాలని కమిటీ చైర్మన్ మరియు సభ్యులకు మంత్రి స్పష్టమైన సూచనలు చేశారు. అర్హులైన నిజమైన ప్రతిభావంతులకే పురస్కారాలు దక్కాలని ఆదేశించారు.
ఈ అవార్డుల ఈవెంట్ నిర్వహణ బాధ్యతలను ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ముకుంద రెడ్డి ప్రత్యేకంగా పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. వేడుకలను కన్నుల పండువగా జరిపేందుకు అనువుగా ఉండే రెండు లేదా మూడు ప్రధాన వేదికల (వెన్యూస్) జాబితాను ముందుగానే సిద్ధం చేసి ఉంచాలని చెప్పారు. ప్రదానోత్సవ కార్యక్రమం రాష్ట్రస్థాయిలో మైలురాయిగా నిలిచిపోయేలా ఏర్పాట్లు ఉండాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మరియు అధికారులు అందించిన పలు రకాల ప్రతిపాదనలు, సూచనలపై సమగ్రంగా చర్చించామన్నారు. వీటన్నింటినీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఆయనతో తుది విడత చర్చించిన అనంతరం అవార్డుల తేదీలు, లోగో మరియు పేరును అధికారికంగా ప్రకటిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వివరించారు.

# బోధన్ కరాటే మాస్టర్ సాయిలుకు 'గిన్నిస్ రికార్డు' ప్రశంసాపత్రం

- **హైదరాబాద్‌లో డాక్టర్ సుమన్ తల్వార్ చేతుల మీదుగా ప్రదానం**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూలై 28 (డీడీ9 వార్త) :**

ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ కార్యక్రమంలో విశేష ప్రతిభ కనబరిచిన బోధన్‌కు చెందిన కరాటే మాస్టర్ యు.సాయిలు, ఆయన వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్' ప్రత్యేక సర్టిఫికెట్లు సాధించి పట్టణానికి ఖ్యాతి తెచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 2వ అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్-2026 బ్రోచర్, విజేత ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు, మార్షల్ ఆర్ట్స్ ప్రోత్సాహకుడు డాక్టర్ సుమన్ తల్వార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేదికపై బోధన్ కరాటే మాస్టర్ యు.సాయిలుతో పాటు అక్కడ పాల్గొన్న బోధన్ ప్రాంత విద్యార్థులకు డాక్టర్ సుమన్ తల్వార్ స్వయంగా గిన్నిస్ రికార్డు ప్రశంసాపత్రాలను ప్రదానం చేసి, వారి ప్రతిభను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమన్ తల్వార్ మాట్లాడుతూ.. కరాటే సాధన వల్ల యువతలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, ఆత్మరక్షణ నైపుణ్యాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థినులకు ఆత్మరక్షణ శిక్షణ ఎంతో అవసరమని, మార్షల్ ఆర్ట్స్‌ను ప్రోత్సహించడం ద్వారా కరాటే మాస్టర్లకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. ఫైట్ మాస్టర్ రవి, ఒకినావా చీఫ్ కరాటే మాస్టర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జ్యూరీ డాక్టర్ అజయ్ కుమార్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ చైర్మన్ పి.రామకృష్ణలతో పాటు పలు జిల్లాల కరాటే మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.




# వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం.. పరిశుభ్రతే ప్రధానం

- **అధికారులకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశం**
- **బాల్కొండలో ఎస్సీ, బీసీ హాస్టళ్ల సలహా కమిటీ సమీక్ష**

**నిజామాబాద్ జిల్లా, జూలై 28 (డీడీ9 వార్త) :**

ప్రభుత్వ ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యమివ్వాలని, వారికి నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు వసతి గృహాల్లో కచ్చితమైన పారిశుద్ధ్యం పాటించాలని బాల్కొండ ఎమ్మెల్యే, హాస్టల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశించారు. బాల్కొండలోని తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ, బీసీ హాస్టళ్ల నిర్వహణ, వసతులు, ఆహార నాణ్యతపై అధికారులతో ఆయన సలహా కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిరోజూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం వడ్డించాలని స్పష్టం చేశారు. మరుగుదొడ్లు, స్నానాల గదులను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుద్ధ్య లోపంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యే పరిస్థితులు ఎక్కడా తలెత్తకూడదని హెచ్చరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఎలాంటి అవసరాలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బాల్కొండ నియోజకవర్గంలో 8 ఎస్సీ, 5 బీసీ హాస్టళ్ల ద్వారా వందలాది మంది పేద విద్యార్థులకు ఉచితంగా వసతి, భోజనం అందుతోందని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఎస్సీ హాస్టళ్లు 8లో వేల్పూర్ 100, మోర్తాడ్ బాలురు 100, మోర్తాడ్ బాలికలు 98, కొనసముందర్ 88, భీంగల్ బాలికలు 86, చౌటుపల్లి 79, ఎర్గట్ల 61, భీంగల్ బాలురు 31 విద్యార్థులు అడ్మిషన్ పొందినట్లు తెలిపారు.
బీసీ హాస్టళ్లు 5 లో పడ్గల్ 99, వేల్పూర్ 86, చౌటుపల్లి 82, బాల్కొండ 53, భీంగల్ 34 మంది విద్యార్థులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నిజామాబాద్ జిల్లా ఏఎస్సీడీవో రాజ్‌గంగారాం, ఏబీసీడీవో సుజయ్, వివిధ మండలాలకు చెందిన హాస్టల్ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.



# వాజేడు మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

- అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై సమగ్ర సమీక్ష
- వర్షా కాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి – ఎమ్మెల్యే
- వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశం
- ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని సూచన

**వాజేడు, జూలై 28 (డీడీ9 వార్త):**





ములుగు జిల్లా వాజేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై మండలంలోని అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.
సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ఆరోగ్య శాఖ అధికారులు వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.
అదేవిధంగా ప్రతి శాఖ ప్రజలకు అవసరమైన సేవలను సకాలంలో అందించేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. మండల అభివృద్ధికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.
ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బోనమెత్తిన పద్మశాలి ఆడపడుచులు.. పోచమ్మ అమ్మవారికి ఘనంగా బోనం సమర్పణ

**బాన్సువాడ, డిడి9 వార్త:**

బోనాల పండుగను పురస్కరించుకుని బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి గ్రామంలో మంగళవారం పద్మశాలి సంఘానికి చెందిన ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో బోనం ఎత్తి గ్రామంలోని పోచమ్మ అమ్మవారికి సమర్పించారు.సాంప్రదాయ వస్త్రధారణలో మహిళలు మంగళవాయిద్యాల నడుమ, భక్తి గీతాలు ఆలపిస్తూ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అమ్మవారికి బోనం సమర్పించి గ్రామంలో సుఖశాంతులు నెలకొనాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వర్షాలు సమృద్ధిగా కురవాలని భక్తిపూర్వకంగా ప్రార్థించారు .ఈ సందర్భంగా పద్మశాలి సంఘ సభ్యులు మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు.ప్రతి సంవత్సరం ఇదే విధంగా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలుస్తూ గ్రామ శ్రేయస్సు కోసం ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ సభ్యులు దీకొండ రమేష్,రచ్చ ఆంజనేయులు,గాజుల పందరి, సాయినాథ్, అన్న ఆంజనేయులు, బేతి పోశెట్టి, గాజుల గణేష్, రచ్చ సురేష్, గాజుల సాయిలు, గాజుల శ్రీనివాస్అ, న్నం ముత్తయ్య,అంకం దేవదాస్, అన్నం సాయిబాబా, అన్నం ప్రభు,అన్నం వెంకయ్య, అన్నం రమేష్, మరియుమహిళలు, యువతులు, చిన్నారులు, గ్రామ పెద్దలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన డాక్టర్ సీతలే రమేష్

- దాతల సహకారంతో రూ.24 వేల ఆర్థిక సహాయం
- మానవత్వానికి నిదర్శనంగా సేవాభావం

**బాన్సువాడ, డిడి9 వార్త:**

ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని మరోసారి నిరూపించారు లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్, ప్రముఖ స్వచ్ఛంద సేవా నాయకులు డాక్టర్ సీతలే రమేష్. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన కోటగిరి మండల కేంద్రానికి చెందిన పాల సావిత్రి కుటుంబానికి దాతల సహకారంతో సమీకరించిన రూ.24 వేల ఆర్థిక సహాయాన్ని అందించి వారి కష్టకాలంలో భరోసాగా నిలిచారు.ఈ నెల 19వ తేదీన పాల సావిత్రి, ఆమె భర్త పాల పోశెట్టి నిజామాబాద్ నుండి కోటగిరికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మోస్రా గ్రామ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన మినీ వ్యాన్ ఢీకొట్టింది .ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని హోప్ ఆస్పత్రికి తరలించి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించారు. ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో చికిత్స ఖర్చులు రోజురోజుకు పెరిగి సుమారు రూ.2 లక్షలకు చేరుకున్నాయి. దీంతో నిరుపేద కుటుంబమైన పాల పోశెట్టి కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంది. ఈ విషయం తెలిసిన స్థానికులు, స్నేహితులు, దాతలు తమ వంతు సహాయంగా ఫోన్‌పే ద్వారా విరాళాలు అందించి కుటుంబానికి కొంత ఊరటనిచ్చారు. ఇదే సమయంలో ప్రమాద వివరాలు తెలుసుకున్న డాక్టర్ సీతలే రమేష్ వెంటనే స్పందించి తన వాట్సాప్ స్టేటస్ ద్వారా దాతలను సహాయం చేయాలని కోరారు. ఆయన పిలుపుకు విశేష స్పందన లభించడంతో వివిధ ప్రాంతాలకు చెందిన దాతలు ముందుకు వచ్చి ఫోన్‌పే ద్వారా మొత్తం రూ.24 వేల విరాళాలను సమీకరించారు. సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండే డాక్టర్ సీతలే రమేష్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. అయితే చికిత్స పొందుతూ పాల సావిత్రి ఈ నెల 26వ తేదీన మృతి చెందడం కుటుంబాన్ని విషాదంలోకి నెట్టింది. ఆమె మరణంతో కుటుంబం తీవ్ర ఆర్థిక, మానసిక వేదనలోకి వెళ్లింది. ఈ నేపథ్యంలో చికిత్స కోసం సమీకరించిన రూ.24 వేల మొత్తాన్ని డాక్టర్ సీతలే రమేష్ స్వయంగా పాల పోశెట్టి, వారి పిల్లలు, కుటుంబ సభ్యులకు అందజేసి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ భవిష్యత్తులో కూడా అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, అత్యంత క్లిష్ట సమయంలో తమకు అండగా నిలిచి దాతలను సమీకరించి ఆర్థిక సహాయం అందించిన డాక్టర్ సీతలే రమేష్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో ఇలాంటి సేవాభావం కలిగిన వ్యక్తులు ఉండడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పందిముక్కుల సాయిలు, దాత్తు పటేల్, సున్నం రాజు, సుధాకర్ రెడ్డి, పాల పోశెట్టి కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు, దాతలు పాల్గొన్నారు. కష్టకాలంలో మానవత్వంతో ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



# గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతోనే పటిష్ట నిఘా : ఎస్సై రాజశేఖర్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, డిడి9 వార్త :**

గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని బోధన్ రూరల్ ఎస్సై రాజశేఖర్ అన్నారు. సాలుర మండలం సాలుర క్యాంపు గ్రామంలో మంగళవారం 'మన ఊరు మన భద్రత మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ.... గ్రామాల్లో అసాధారణ కార్యకలాపాలను అరికట్టడానికి, నేరాలను తక్షణమే ఛేదించడానికి సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమని తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల గ్రామంలో పూర్తి నిఘా ఉంటుందని, దొంగతనాలు వంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. యువత, వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలని కోరారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్‌కు దూరంగా ఉండాలని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో ఎవరికైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది అనిరుద్ధ్, హరీష్ గౌడ్, అమరేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.




# గ్రంథాలయాల అభివృద్ధే లక్ష్యం జిల్లా చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి

- విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలను రెండు రోజుల్లో సమకూరుస్తామని హామీ
- త్వరలోనే గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, డిడి9 వార్త :**

విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పించి గ్రంథాలయాలను మరింత బలోపేతం చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి స్పష్టం చేశారు. బోధన్ పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న వసతులు, వివిధ పుస్తకాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అక్కడ చదువుకుంటున్న పాఠకులు, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు తమకు మరికొన్ని కొత్త పుస్తకాలు, అధ్యయన సామగ్రి కావాలని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన.. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను రాబోయే రెండు రోజుల్లోనే సమకూరుస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు, యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడంలో భాగంగా త్వరలోనే గ్రంథాలయ ఆవరణలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తలారీ నవీన్, గ్రంథాలయ సిబ్బంది, స్థానిక ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

- బెల్లాల్‌లో నివాసం లేని గృహాలను పరిశీలించిన డీఆర్ఓ గీత

**బోధన్, నిజామాబాద్ జిల్లా, డిడి9 వార్త :**

బోధన్ మండలం బెల్లాల్ గ్రామ పంచాయతీ పరిధిలో ఏళ్ల తరబడి నివాసం లేని ఇందిరమ్మ ఇళ్లను జిల్లా రెవెన్యూ అధికారి గీత మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో అర్హులైన పేదలకు ఇళ్లు దక్కకుండా, నిర్మించిన గృహాలు ఖాళీగా పడి ఉండటంపై గ్రామస్తుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆమె ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్ఓ గీత మాట్లాడుతూ.. బెల్లాల్ గ్రామంలో సుమారు 15 సంవత్సరాల క్రితం పేదల నివాసం కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించిందని తెలిపారు. అయితే లబ్ధిదారులుగా ఎంపికైన వారిలో సగానికి పైగా ఇళ్లలో నివాసం ఉండటం లేదని, అనేక గృహాలు ఖాళీగా పడి ఉండి పాడవుతున్నాయని పేర్కొన్నారు. గ్రామంలో నిజమైన పేదలు నివాస వసతి లేక ఇబ్బందులు పడుతుంటే, ఇళ్లు పొందిన కొందరు వాటిలో ఉండకపోవడం సరైంది కాదన్నారు. గ్రామంలో ఖాళీగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను స్వాధీనం చేసుకుని, నిజమైన అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని గ్రామస్తులు పలుమార్లు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన, ఖాళీ ఇళ్లను వెంటనే పరిశీలించి, సమగ్ర విచారణ జరిపి అర్హులైన కొత్త లబ్ధిదారులకు పునఃకేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు గ్రామానికి చేరుకున్న డీఆర్ఓ, ఆర్డీఓలు గ్రామంలోని ప్రతి ఇందిరమ్మ ఇంటిని వ్యక్తిగతంగా పరిశీలించారు. ప్రస్తుతం నివాసం ఉండని వారి వివరాలు, ఇళ్ల స్థితిగతులను నమోదు చేసుకున్నారు. త్వరితగతిన పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన పేద కుటుంబాలకు వీటిని కేటాయించేలా చర్యలు తీసుకుంటామని డీఆర్ఓ స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆర్డీఓ విజయ కుమారి, బెల్లాల్ గ్రామ సర్పంచ్ రాజు, మాజీ సర్పంచ్ సంజీవ్, వార్డు సభ్యులు సతీష్, సంగీత, ప్రసాద్, కవితలతో పాటు స్థానిక రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గోడ గడియారాల పంపిణీ

**బాన్సువాడ, డిడి9 వార్త:**

బీర్కూర్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసిన 14 మంది లబ్ధిదారులకు గోడ గడియారాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మండల తహసీల్దార్ సవాయ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు గోడ గడియారాలను అందజేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు శాశ్వత గృహాలు అందించడం సంతోషకరమని, నిర్మాణాన్ని పూర్తిచేసిన లబ్ధిదారులను అభినందించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ, ఉప సర్పంచ్ పరమేష్, ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ యమ రాములు,మాజీ ఎంపీపీ రఘు, విజయ్ ప్రకాష్, మియాపురం శశి కాంత్, బస్వరాజ్ పటేల్గ్రా, మేకల విట్టల్, దుంపల రాజు, హైమద్, కార్యదర్శి గంగారం, వార్డు సభ్యులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# నిజామాబాద్ రైల్వే ప్రాజెక్టులకు పరిపాలనా అనుమతులివ్వాలి

- **నిజామాబాద్ రైల్వే ప్రాజెక్టులకు పరిపాలనా అనుమతులివ్వాలి**
- **కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన ఎంపీ అర్వింద్**
- **నవీపేట్ లో ఆర్ఓబీ, డిచ్‌పల్లిలో ఆర్‌యూబీ నిర్మాణాలకు వినతి**
- **స్థానిక ప్రజల రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి**

**నిజామాబాద్ జిల్లా, జూలై 28 (డీడీ9 వార్త) :**

నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నిలిచిపోయిన, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ రైల్వే ప్రాజెక్టులకు త్వరితగతిన పరిపాలనా, ఆర్థిక అనుమతులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు. ఈ మేరకు న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రైల్వే మౌలిక వసతుల కల్పన, ప్రయాణికుల భద్రత, రవాణా సౌకర్యాల విస్తరణపై మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. నిజామాబాద్ ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన పనులకు ఆమోదం తెలపడంతో పాటు, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాజెక్టుల నిర్మాణాలను నిర్ణీత గడువు లోగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో నిత్యం వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రధాన రైల్వే గేట్ల సమస్యపై ఎంపీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగా నవీపేట్ రైల్వే క్రాసింగ్ వద్ద నూతనంగా రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా డిచ్‌పల్లి రైల్వే క్రాసింగ్ వద్ద తీవ్ర ట్రాఫిక్ నిరోధానికి అడ్డుకట్ట వేసేలా రోడ్డు అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ రెండు ప్రాంతాల్లో ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు, పాఠశాల విద్యార్థులు, అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లే రోగులు నిత్యం రైల్వే గేట్ల వద్ద గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని మంత్రికి వివరించారు. అక్కడ ఆర్ఓబీ, ఆర్‌యూబీలు పూర్తయితే ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోవడమే కాకుండా, క్రాసింగ్‌ల వద్ద జరిగే ప్రమాదాలు నివారించబడి ప్రయాణ భద్రత గణనీయంగా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఎంపీ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఎంతో సానుకూలంగా స్పందిస్తూ, ఈ ప్రతిపాదనలను తక్షణమే పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా రైల్వే ఉన్నతాధికారులను ఆదేశిస్తామని హామీ ఇచ్చినట్లు ఎంపీ వెల్లడించారు. ఇటీవల నిజామాబాద్ నియోజకవర్గానికి ప్రాధాన్యమిస్తూ ఇందల్‌వాయి, జానకంపేట్ క్రాసింగ్‌ల వద్ద నూతనంగా రోడ్డు ఓవర్ బ్రిడ్జిలను మంజూరు చేసినందుకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఎంపీ అర్వింద్



ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని రైల్వే వ్యవస్థను ఆధునీకరించేందుకు, రవాణా సౌకర్యాలను మరింత పెంచేందుకు నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. రైల్వే మౌలిక వసతుల కల్పన, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదలకు రానున్న రోజుల్లో కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# నిక్కచ్చిగా పనిచేసి పోలీస్ ఇమేజ్ పెంచాలి

- **త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ సాయి చైతన్య**

**నిజామాబాద్ జిల్లా, జూలై 28 (డీడీ9 వార్త) :**

అధికారి, సిబ్బంది నిక్కచ్చిగా విధులు నిర్వహించాలని, స్టేషన్‌కు ఫిర్యాదు రాగానే త్వరితగతిన స్పందించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశించారు. మంగళవారం ఆయన నగరంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, వివిధ ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి, దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కేసుల ఛేదనకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు. నిజామాబాద్ నగరంలోకి వేరే ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే వారిపై నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. సులభంగా డబ్బు సంపాదించవచ్చనే ఆశతో యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమింగ్ యాప్‌ల బారినపడి అప్పులపాలై ప్రాణాలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై పాఠశాలలు, కళాశాలల్లో నిరంతరం అవగాహన సదస్సులు నిర్వహించాలని స్పష్టం చేశారు. స్టేషన్ పరిధిలోని కాలనీల్లో ప్రజలతో మమేకమై స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. నిత్యం ట్రాఫిక్ సమస్యల నియంత్రణకు ప్రధాన కూడళ్లలో తనిఖీలు చేపట్టాలన్నారు. అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ హెడ్‌క్వార్టర్స్‌లోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతి ఆరు నెలలకోసారి సిబ్బంది ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి నిబంధనలు పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్, టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్, టౌన్-3 ఎస్సై ఎ.హరిబాబు, ఎస్సై-2 నారాయణ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.







# కళాశాల అభివృద్ధికి అండగా ఉంటా

- **40 డ్యూయల్ డెస్క్‌ల బల్లల విరాళం**
- **త్వరలోనే శాశ్వత భవనానికి ప్రతిపాదనలు: ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి**

**నిజామాబాద్ జిల్లా, జూలై 28 (డీడీ9 వార్త) :**

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కమ్మర్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ ముందుంటానని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థుల విజ్ఞప్తి మేరకు తన వియ్యంకుడు ఏనుగు దయానంద్‌రెడ్డి (దయానంద్ రెడ్డి ట్రస్ట్) సౌజన్యంతో సమకూర్చిన రూ. 1.50 లక్షల విలువైన 40 డ్యూయల్ డెస్క్ బల్లలను మంగళవారం ఆయన కళాశాలకు అందజేశారు. కోరిన వారం రోజుల్లోనే స్పందించి బల్లలు పంపిన దయానంద్‌రెడ్డికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 2023లో స్థానిక ప్రజలు, నాయకుల కోరిక మేరకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో కమ్మర్‌పల్లికి జూనియర్ కళాశాల మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే గుర్తుచేశారు. గత రెండున్నరేళ్లుగా పాఠశాల భవనంలో తరగతులు కొనసాగుతుండటం వల్ల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా ప్రస్తుతం ఖాళీగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల భవనంలోకి కళాశాలను మార్చి, అవసరమైన మరమ్మతులు చేయిస్తామన్నారు. అలాగే జూనియర్ కళాశాలకు శాశ్వత నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి తక్షణమే ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు, సిబ్బంది కొరతపై జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. ఎన్నికల ఫలితాలతో తనకు సంబంధం లేదని, పదవుల్లో ఉన్నా లేకున్నా కమ్మర్‌పల్లి ప్రజలకు ఏ కష్టం వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే స్పందించి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ దేవేందర్, బిఆర్ఎస్ నాయకులు రాజగౌడ్, బద్దం చిన్నారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, కమ్మర్‌పల్లి సర్పంచ్ హారిక అశోక్, ఉప సర్పంచ్ అశోక్, ఆర్ఆర్ నగర్, చౌట్‌పల్లి, బషీరాబాద్, నర్సాపూర్ గ్రామాల సర్పంచులు, ఎంపీడీఓ, స్పెషల్ ఆఫీసర్, వీడీసీ అధ్యక్షుడు సుభాష్, ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా లుక్కా గంగాధర్

**నిజామాబాద్ జిల్లా, జూలై 28 (డీడీ9 వార్త) :**



లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్‌పల్లి మాజీ అధ్యక్షుడు లయన్ లుక్కా గంగాధర్ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా ఎన్నిక కావడం పట్ల లయన్స్ క్లబ్ కమ్మర్‌పల్లి అధ్యక్షుడు లయన్ తెడ్డు రమేష్ హర్షం వ్యక్తం చేశారు. లుక్కా గంగాధర్‌కు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెడ్డు రమేష్ మాట్లాడుతూ.. గంగాధర్ తన సేవా స్ఫూర్తితో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని, లయన్స్ క్లబ్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతమై సమాజంలోని ప్రతీ వర్గానికి, నిరుపేదలకు చేరువ కావాలని కోరుతూ అభినందనలు తెలిపారు.

# గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దాం

- **ట్రిబ్యునల్ సభ్యుడు వేణుగోపాల్ యాదవ్‌కు ఘన సత్కారం**

**నిజామాబాద్ జిల్లా, జూలై 28 (డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండల పరిధిలోని హసా కొత్తూరు గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్ సభ్యుడు బాస వేణుగోపాల్ యాదవ్‌ను గ్రామ సర్పంచ్ నలిమెల రేవతి గంగారెడ్డి, పాలకవర్గ సభ్యులు మంగళవారం ఘనంగా సత్కరించారు. గ్రామంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయనకు పూలమాలలు వేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం వేణుగోపాల్ యాదవ్ సైతం సర్పంచ్, ఉప సర్పంచ్‌లను గౌరవించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని వివిధ మౌలిక వసతుల కల్పన, నిలిచిపోయిన అభివృద్ధి పనులు, ఇతర స్థానిక సమస్యలపై పాలకవర్గ సభ్యులు ట్రిబ్యునల్ సభ్యుడితో వివరంగా చర్చించారు. గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఈ సందర్భంగా వేణుగోపాల్ యాదవ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఏనుగు మనోహర్, పంచాయతీ కార్యదర్శి నల్లగంటి నరసయ్య, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎడ్ల శ్రీకాంత్, పాలకవర్గ సభ్యులు కుందేటి శ్రీనివాస్, రాధారపు గంగాధర్, జుంబరత్ అశోక్, కల్లెడ కాశవ్వ, కల్లెడ రాణి, పసుల గంగు తదితరులు పాల్గొన్నారు.



# క్షయరహిత సమాజ నిర్మాణమే అందరి లక్ష్యం

- **28వ వార్డులో 'టీబీఎంబీఏ 2.0' మెగా ఉచిత ఆరోగ్య శిబిరం**

**నిజామాబాద్ జిల్లా, జూలై 28 (డీడీ9 వార్త) :**

దేశాన్ని క్షయరహితంగా మార్చడమే ప్రతి ఒక్కరి ప్రాథమిక లక్ష్యం కావాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ దేవి నాగేశ్వరి పిలుపునిచ్చారు. నగరంలోని 28వ వార్డులో నిర్వహించిన 'టీబీఎంబీఏ 2.0' మెగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని మంగళవారం వారు సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వార్డు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఛాతీ ఎక్స్‌రే సహా ఉచిత వైద్య పరీక్షలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'నిక్షయ్ మిత్ర'గా సేవలందిస్తూ క్షయ బాధితులకు నిరంతరం అండగా నిలుస్తున్న 28వ వార్డు కార్పొరేటర్ మల్కాయి మహేందర్‌ను డీఎంహెచ్ఓ రాజశ్రీ, డీటీసీఓ దేవి నాగేశ్వరితో పాటు ఎస్ఆర్ నగర్ యూపీహెచ్‌సీ సిబ్బంది ఘనంగా సత్కరించారు. అనంతరం నిక్షయ్ మిత్ర హోదాలో కార్పొరేటర్ మహేందర్ టీబీ రోగులకు ఉచిత పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. స్థానిక ప్రజల కోసం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి నాణ్యమైన వైద్యం అందించినందుకు కృతజ్ఞతగా డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, డీటీసీఓ డాక్టర్ దేవి నాగేశ్వరిలను కార్పొరేటర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్షయ నియంత్రణ విభాగం సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# వెంకటాపూర్ తెలంగాణ రాజ్యాధికార పార్టీ నూతన నియామకాలు

- **టి ఆర్ పి బలోపేతానికి కృషి చేస్తున్న**
- **ములుగు జిల్లా అధ్యక్షులు కవిటి దిలీప్ కుమార్ ముదిరాజ్**

**ములుగు, జూలై 28, ఆదాబ్ హైదరాబాద్ :**

వెంకటాపూర్ మండలంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల కమిటీ నియామక కార్యక్రమం నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గట్ల రాజన్న, ములుగు జిల్లా అధ్యక్షులు తవిటి దిలిప్ కుమార్ ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షురాలు శీలవంతుల సునీత, మొగిలిపల్లి వినోద్, జిల్లా కార్యదర్శులు మనమ్మ, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు ఆజం షేక్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు పోలేపాక యాకన్న, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గట్ల వినీత్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ దురిశెట్టి విజయ్ కుమార్ పాల్గొని నూతన మండల కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

**వెంకటాపూర్ మండల కమిటీ:**

మండల అధ్యక్షులు - రెడ్డి తిరుపతి
మండల ఉపాధ్యక్షులు - పందిరి శ్రీనివాస్
మండల ప్రధాన కార్యదర్శి - రెడ్డి ప్రవీణ్
మండల అధికార ప్రతినిధి - ఎనపోతుల రమేష్
మండల కోశాధికారి - గువ్వ రాజు
మండల కార్యదర్శి - కస్తూరి సదాచారి
మండల సంయుక్త కార్యదర్శి - కూరెళ్ల భూషణ చారి
మండల ప్రచార కార్యదర్శి - తడక రాజ్ కుమార్
మండల కార్యకర్తలు - జనగాం రామచంద్రు, జనగాం నరేందర్

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడానికి నూతన కమిటీ సభ్యులు సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.



# వన సంరక్షణ ప్రతి పౌరుని బాధ్యత

**నిజామాబాద్ జిల్లా, జూలై 28 (డీడీ9 వార్త) :**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సర్పంచ్ బెజ్జారం రాకేష్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతీ ఏటా వర్షాకాలంలో నిర్వహించే 'వనమహోత్సవం' కార్యక్రమంలో భాగంగా కమ్మర్మం పల్లి మండలంలోని కోనసముందర్ గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. టిజిబి బ్యాంకుకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, పంచాయతీ సిబ్బంది కలసి మొక్కలను నాటారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ ఉచితంగా చెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలు, పర్యావరణ సమతుల్యత ప్రాధాన్యతను గ్రామస్థులకు వివరించారు. ప్రకృతిని, వనాలను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలేరావ్ శంకర్, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ గోపాల్, సీఏ, మహిళా సమాఖ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థుల్లో నాయకత్వ పటిమ పెంచేందుకే 'బాలసభ'

**నిజామాబాద్ జిల్లా, జూలై 28 (డీడీ9 వార్త) :**

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, నాయకత్వ లక్షణాలను వెలికితీసేందుకు పాఠశాలల్లో నిర్వహించే 'బాలసభలు' ఎంతగానో దోహదపడతాయని హసాకొత్తూరు సర్పంచ్ నలిమెల రేవతి గంగారెడ్డి పేర్కొన్నారు. కమ్మర్‌పల్లి మండల పరిధిలోని హసాకొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 'బాలసభ' నిర్వహించారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం కృష్ణకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో మన కళ్లముందు ఉండే సమస్యలపై అవగాహన పెంచుకోవడానికి, వాటి పరిష్కార మార్గాలు అన్వేషించే ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించుకోవడానికి ఇటువంటి సభలు ఉపయోగపడతాయన్నారు. బాలసభలో విద్యార్థులు లేవనెత్తిన పాఠశాల, గ్రామ సమస్యలను రికార్డు చేశామని, త్వరలోనే వాటన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు సంభవించే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తూ తగిన జాగ్రత్తలు వహించాలని సూచించారు. బాలసభలో విద్యార్థులే ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి అలరించారు. సర్పంచ్‌గా విద్యార్థి శ్రీకర్, ఉపసర్పంచ్‌గా రోషిణి, వార్డు సభ్యులుగా మరికొందరు విద్యార్థులు బాధ్యతలు చేపట్టి పాఠశాల, గ్రామంలో ఎదురవుతున్న పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి తమ నిరసనలు, పరిష్కారాలను వినిపించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగు మనోహర్, పంచాయతీ కార్యదర్శి నల్లగంటి నరసయ్య, యూపీఎస్ హెచ్ఎం వేణు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సంతోష్, వార్డు సభ్యులు కుండేటి శ్రీనివాస్, జుంబరత్ అశోక్, రాధారపు గంగాధర్, కల్లెడ రాణి, కాశవ్వ, పసుల గంగు, ఏఎన్ఎం మమత, మహిళా సంఘాల ప్రతినిధులు సరిత, కమల, మాధవి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.





## ఇసుకవాగును పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు

- **ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం**

**వాజేడు, జూలై 28 (డీడీ9 వార్త):**

ములుగు జిల్లా వాజేడు మండలంలోని ఇసుకవాగును స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేతో కలిసి పాల్గొన్నారు. ఇసుకవాగు పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించిన ఎమ్మెల్యే అనంతరం ఇంజినీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వాగు ప్రస్తుత పరిస్థితులు, అవసరమైన అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులతో చర్చించారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పనులను వేగవంతం చేయాలని సూచించారు.



## పని వేళల్లోనే మల్లంపల్లి ప్రభుత్వ వెటర్నరీ హాస్పిటల్‌కు తాళం

- **కనీసం సిబ్బంది సంప్రదింపు నంబర్లు కూడా లేవు**
- **బీజేపీ మండల అధ్యక్షుడు బైకాని మహేందర్ యాదవ్ ఆగ్రహం**

**డీ డీ 9 వార్త, ములుగు :**

ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ వెటర్నరీ హాస్పిటల్‌ను బీజేపీ మల్లంపల్లి మండల అధ్యక్షుడు బైకాని మహేందర్ యాదవ్ ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వ నిర్ణయించిన పని వేళల్లోనే హాస్పిటల్ మూసివేసి ఉండటంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన సమయంలోనే తాళం వేసి ఉండటం అత్యంత బాధ్యతారాహిత్యం. అత్యవసర పరిస్థితుల్లో రైతులు, పశుపాలకులు ఎవరిని సంప్రదించాలి? పశువులకు వైద్య సేవలు ఎలా అందాలి?" అని ప్రశ్నించారు. అలాగే, హాస్పిటల్ వద్ద విధుల్లో ఉన్న వైద్యులు లేదా సిబ్బంది పేర్లు, సంప్రదింపు నంబర్లు, అత్యవసర సేవల కోసం కాల్ చేయాల్సిన ఫోన్ నంబర్లు, పని వేళల వివరాలు వంటి కనీస సమాచారం కూడా ప్రదర్శించకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. దీంతో ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి నెలకొంటోందని అన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు వెంటనే ఈ ఘటనపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, అన్ని ప్రభుత్వ వెటర్నరీ హాస్పిటళ్లలో పని వేళలు, సిబ్బంది వివరాలు, అత్యవసర సంప్రదింపు నంబర్లను స్పష్టంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు బైకాని మహేందర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మల్లంపల్లి మండల ఉపాధ్యక్షులు కొండ యుగేందర్ బండి బాబు జనరల్ సెక్రెటరీ ఎండిగ రాజు కార్యదర్శి పోతరాజు సంపత్ తదితరులు పాల్గొన్నారు

## కృష్ణవేణి వికాస్ కళాశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

- **ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐ టెస్ట్**
- **మొబైల్ మోజుతో పెరుగుతున్న దృష్టి లోపాలు**
- **నేటి విద్యార్థులకు నేత్ర పరీక్షలు తప్పనిసరి**
- **డిజిటల్ స్క్రీన్ల వినియోగంతో కంటి సమస్యలు పెరుగుతున్నాయని డాక్టర్ భవ్య హెచ్చరిక**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 28 (డీడీ9 వార్త):**

విద్యార్థుల్లో కంటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు దృష్టి లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించాలనే లక్ష్యంతో గోదావరిఖనిలోని కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాలలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఫ్రెండ్స్ ఫౌండేషన్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో, డాక్టర్ భవ్య ఐ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో విద్యార్థులకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ భవ్య మాట్లాడుతూ.... మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర డిజిటల్ స్క్రీన్లను అధికంగా వినియోగించడం వల్ల విద్యార్థుల్లో కంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. దృష్టి లోపాలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని, కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రమం తప్పకుండా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో కంటి సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించడం, సరైన కంటి సంరక్షణ అలవాట్లను పెంపొందించడం ఈ శిబిరం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు రౌతు గణేష్ కుమార్, కామెర శ్రీనిత్, కోలేటి విశాల్, మీస వికాస్, మర్కా అశ్రిత్, కళాశాల చైర్మన్ డా. రవికుమార్ నాగండ్ల, డైరెక్టర్ జమున, ప్రిన్సిపాల్ వెంకన్న, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అంతిమ సంస్కారాలకు అవస్థలు...

- **ఖని హిందూ స్మశాన వాటికలో సమస్యల గుట్ట**
- **కమిషనర్ వైఖరిపై స్వచ్ఛంద సంస్థల మండిపాటు**
- **పేదలకు ఉచిత అంత్యక్రియల సేవలు పునరుద్ధరించాలని డిమాండ్**
- **పూలు చల్లి వినూత్న నిరసన తెలిపిన స్వచ్ఛంద సంఘాలు**
- **సింగరేణి ఆధ్వర్యంలో స్మశాన వాటిక నిర్వహణ చేపట్టాలని డిమాండ్**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 28 (డీడీ9 వార్త):**

గోదావరిఖని గోదావరి నది తీరంలోని హిందూ స్మశాన వాటికలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం పూలు చల్లి వినూత్నంగా నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ గౌరవ అధ్యక్షులు మద్దెల దినేష్, అధ్యక్షులు అయిత శివకుమార్, ప్రధాన కార్యదర్శి దుర్గం నగేష్, ఉపాధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ..., స్మశాన వాటికలో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా రూపాయికే అంత్యక్రియల పథకం నిలిచిపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. స్మశాన వాటికలో తాగునీరు, విద్యుత్, రహదారి, ప్రహరీ గోడ వంటి కనీస వసతులు కూడా లేకపోవడంతో ముఖ్యంగా రాత్రివేళల్లో అంత్యక్రియలు నిర్వహించడం కష్టంగా మారిందని తెలిపారు.

దాదాపు పదేళ్ల క్రితం రూ.40 లక్షలతో



కొనుగోలు చేసిన గ్యాస్ ఆధారిత దహన యంత్రం, రూ.60 లక్షలతో నిర్మించిన షెడ్ వినియోగంలో లేక వృథాగా మారిపోయాయని విమర్శించారు. స్మశాన వాటిక ముందు ఉన్న సుమారు 10 ఎకరాల సింగరేణి ఖాళీ స్థలాన్ని స్మశాన వాటిక అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టాలని కోరుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో స్మశాన వాటిక అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. హిందూ స్మశాన వాటిక నిర్వహణ బాధ్యతను సింగరేణి యాజమాన్యానికి అప్పగించి ప్రజలకు ఉచిత సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో మండల శ్రీనివాస్, కంది సుజాత, సరిత లక్ష్మి, రామ, సుశీల, కొండూరు రమాదేవి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశం

- **మండల అధ్యక్షులు తాళ్లపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూక్య జోహార్ లాల్**

**తాడ్వాయి మండలం డిడి9 వార్త రిపోర్టర్**

ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ చారి హాజరై మాట్లాడుతూ నరేంద్ర మోడీ పరిపాలన అభివృద్ధి కార్యక్రమల గురించి బూత్ స్థాయిలో ప్రజలోకి తీసుకోని వెళ్లాలని అలాగే స్థానిక సమస్యలపై ప్రజా పోరాటాలు చేస్తూ పార్టీ ని బలోపేతం చేయాలనీ 2026 సమగ్ర ఓటరు సవరణపై BLA2 లకు పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయటం జరిగింది అలాగే జిల్లాలో ఇసుక లారీల రవాణా వల్ల ఈమధ్య కాలంలో తరుచు జాతీయ రహదారి వెంట రోజు ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి దింతో చాలా మంది ప్రజలు మృత్యువాతపడుతూ తీవ్ర గాయల పాలవుతూ భయం భయంగా జాతీయ దారి వెంట ప్రయాణం చేయవలసి వస్తుందని తెలిపారు కావున ఈఇసుక లారీల రవాణాను రాత్రి సమయంలో 11 గంటల తర్వాత మాత్రమే రవాణా చేసుకోవాల్సిందిగా ఇసుక కాంట్రాక్టర్లకు వారి ఓనర్లకు ఈప్రభుత్వం తెలపాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం చేస్తున్న ఈఇసుక రవాణాపై ఇలాంటి చర్యలు తీసుకొని ఎడల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు తెలియజేస్తాం అలాగే రాబోయే రోజుల్లో కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించడం కూడా జరుగుతుంది అని ఈసందర్భంగా మాట్లాడడం జరిగింది అలాగే మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి వచ్చేటటువంటి భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శన భాగ్యం కల్పించాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం జాతర జరిగే ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ ఇంకా అభివృద్ధి పనులు పూర్తి కాకుండా నత్త నడకన నడుస్తూ తల్లుల దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు కావున ఈఅభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నాం ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు భర్త పురం నరేష్ మేడిశెట్టి ఓమ్రా గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు సిద్ధ బోయిన సురేందర్ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జంగా హనుమంత రెడ్డి జిల్లా ఐటి కన్వీనర్ ద్యాగల సలేందర్ బీజేవైఎం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మాదరి శ్రీకాంత్ మండల ప్రధాన కార్యదర్శులు ఆలం శ్రీను మోరే నాగేశ్వరరావు మండల ఉపాధ్యక్షులు పెండకట్ల సాగర్ మండల నాయకులు సిద్ధ బోయిన నారాయణ పూణే భాస్కర్ వర్ధల్లి వెంకన్న బూత్ అధ్యక్షులు రఘు బాబు కొప్పుల సుధాకర్ తోలెం అనిల్ తదితర నాయకులు పాల్గొన్నారు



## రైస్ మిల్లర్లపై జరుగుతున్న విజిలెన్స్ దాడులను నిలిపివేయాలి

- **రైస్ మిల్లర్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్**
- **మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేత**

**ములుగు డీ డీ 9 వార్త :**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్దేశపూర్వకంగా రైస్ మిల్లర్లపై జరుగుతున్న విజిలెన్స్ దాడులను వెంటనే నిలిపివేయాలని రైస్ మిల్లర్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం ములుగు జిల్లాలోని రైస్ మిల్లర్లు అందరూ కలిసి మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసి తమ గోడును వెలిబుచ్చడంతో పాటు రైస్ మిల్లర్ల పై జరుగుతున్న విజిలెన్స్ దాడులను ఆపే విధంగా చూడాలని వినతి పత్రం అందజేశారు. దానికి సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క వెంటనే సంబంధిత శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడడంతోపాటు రైస్ మిల్లర్ల సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆమె ఈ సందర్భంగా హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం రైస్ మిల్లర్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ మాట్లాడుతూ... ప్రభుత్వానికి, రైతు లకు మధ్య వారధిగా పనిచేస్తూ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అయినా సన్న బియ్యం పథకాన్ని విజయవంతం చేసే క్రమంలో సన్నధాన్యం నుండి అవుటర్న్ రాక అనేక నష్టాల పాలవుతున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో రైస్ మిల్లర్ల పై ఒత్తిడి చేసి మిల్లు కెపాసిటీకి మించి అధిక ధాన్యం మిల్లర్ కు ఇచ్చి తదుపరి బియ్యం తీసుకోకపోవడం వలన ధాన్యంలో సహజంగా తరుగుదల ను సాకు గా చూపించి మిల్లర్లు ప్రభుత్వ ధాన్యమును దుర్వినియోగం చేశారు అని ఉద్దేశపూర్వకంగా కేసులు పెడుతూ ఇండస్ట్రీ కుప్పకూలే విధంగా మిల్లర్లను కేసులో పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏన్ని సమస్యలు ఉన్నా మిల్లర్లు వెనుకంజ వేయకుండా రైతుల కోసం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి రైస్ మిల్లర్లపై ఉద్దేశపూర్వకంగా విజిలెన్స్ అధికారులు దాడులు చేపట్టడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి రైస్ మిల్లర్లపై జరుగుతున్న విజిలెన్స్ దాడులను నిలిపివేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్ అసోసియేషన్ కార్యదర్శి సహోదరి రెడ్డి కోశాధికారి ఎలగందుల మోహన్ మరియు జిల్లా రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.



## సింగరేణి భవన్ ముట్టడి తాత్కాలికంగా వాయిదా

- **ఉన్నతాధికారుల హామీతో నిర్ణయం**
- **పెండింగ్ వేతనాల చెల్లింపు, సమస్యల పరిష్కారానికి జాయింట్ మీటింగ్ ఏర్పాటు**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 28 (డీడీ9 వార్త):**



సింగరేణి సులభ్ కాంప్లెక్స్‌లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల నాలుగు నెలల పెండింగ్ వేతనాల చెల్లింపుతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 31న హైదరాబాద్‌లోని సింగరేణి సీఎండీ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఎస్ సి సి డబ్ల్యూ యు-ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. వెంకన్న తెలిపారు.

ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ... భవన్ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో స్పందించిన సింగరేణి ఉన్నతాధికారులు యూనియన్ రాష్ట్ర నాయకత్వంతో చర్చించి, పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులతో కలిసి వారం రోజుల్లో కొత్తగూడెం హెడ్ ఆఫీస్‌లో జాయింట్ మీటింగ్ నిర్వహించి వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

ఈ హామీల నేపథ్యంలో జూలై 31న నిర్వహించాల్సిన సింగరేణి సీఎండీ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని, హామీలు అమలు కాకపోతే మళ్లీ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్మికుల సమస్యలపై స్పందించి చర్చలకు ముందుకొచ్చిన సింగరేణి ఉన్నతాధికారులకు సులభ్ కాంట్రాక్ట్ కార్మికుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఏ. వెంకన్న పేర్కొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా యువత విజయమే: ఏఐటీయూసీ నేత గొడిశల నరేష్

- **విద్యార్థుల ఐక్య పోరాటానికి లభించిన ఫలితం**
- **హక్కులకు భంగం కలిగిస్తే ఉద్యమాలు కొనసాగుతాయని హెచ్చరిక**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 28 (డీడీ9 వార్త):**



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువత, విద్యార్థులు సాధించిన విజయమని ఏఐటీయూసీ జీడీకే-11 ఇంక్లైన్ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ గొడిశల నరేష్ పేర్కొన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గత నెల రోజులుగా దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమాలకు కేంద్ర ప్రభుత్వం స్పందించి ఈ నిర్ణయం తీసుకోవడం ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనమన్నారు. ఇది కేవలం ఒక కేంద్ర మంత్రి రాజీనామా మాత్రమే కాదని, తమ హక్కుల కోసం దేశవ్యాప్తంగా యువత, విద్యార్థులు ఐక్యంగా చేసిన పోరాటానికి దక్కిన విజయమని అన్నారు. యువత సంకల్పం ముందు ఎంతటి ప్రభుత్వమైనా తలవంచాల్సిందేనని మరోసారి రుజువైందన్నారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం, వారి భవిష్యత్తుతో చెలగాటం ఆడడం ఏ ప్రభుత్వానికీ తగదని పేర్కొన్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల హక్కులకు భంగం కలిగించే నిర్ణయాలు తీసుకుంటే ఏఐటీయూసీ యువతతో కలిసి పోరాటాలు కొనసాగిస్తుందని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా ఉద్యమించిన విద్యార్థులు, యువతకు ఈ సందర్భంగా గొడిశల నరేష్ అభినందనలు తెలిపారు.

## "ప్రభుత్వ సమావేశమా... అధికార పార్టీ సభా..?"

- **వేదికపై ప్రోటోకాల్ ఉల్లంఘన..**
- **అధికారుల మౌనం ప్రశ్నార్థకం..**
- **ఇసుక ర్యాంపుల వివాదం.. అధికార పార్టీలోనే విభేదాల..?**
- **మంత్రి, ఎమ్మెల్యే ప్రజలకు సమాధానం చెప్పాలి.. బి.ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు గంప రాంబాబు..**

**జూలై28 డిడి 9 వార్త వెంకటాపురం.**



వెంకటాపురంలో నిర్వహించిన మండల అధికారుల, సర్పంచుల సమీక్ష సమావేశంలో అధికార పార్టీ నాయకుడు చేసిన వ్యాఖ్యలపై జిల్లా మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రజలకు సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప రాంబాబు డిమాండ్ చేశారు. మండల సమావేశంలో ఎలాంటి అధికారిక ప్రోటోకాల్ లేకపోయినా సదరు నాయకుడు వేదికపై కూర్చొని డీసిల్టేషన్ ఇసుక ర్యాంపుల అంశంపై మాట్లాడటం, అదే సమయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై ప్రశ్నలు లేవనెత్తడం విస్మయకరమని అన్నారు. జలవనరులు దెబ్బతింటాయని, రైతులు ఇబ్బందులు పడతారని చెబుతున్న నాయకుడు, అయితే ప్రభుత్వం ఆ ర్యాంపులకు అనుమతులు ఎలా ఇచ్చిందనే విషయంపై మంత్రి, ఎమ్మెల్యే ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. అధికార పార్టీ నాయకులే ప్రభుత్వ నిర్ణయాలను బహిరంగంగా వ్యతిరేకించడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందన్నారు. అలాగే ప్రోటోకాల్ లేకపోయినా సమావేశంలో పాల్గొన్న సర్పంచులతో దురుసుగా వ్యవహరించినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని విమర్శించారు.

ఈ ఘటనపై బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, సమావేశ నిర్వహణలో చోటుచేసుకున్న ప్రోటోకాల్ ఉల్లంఘనలు, అధికారుల వైఖరిపై విచారణ జరిపించాలని కోరనున్నట్లు గంప రాంబాబు తెలిపారు.

# ఆదివాసీ చట్టాలకు ద్రోహం చేస్తే చూస్తూ ఊరుకోం

- 1/70 చట్టం, ఐదో షెడ్యూల్ హక్కులను కాపాడాలి
- మంత్రి పొంగులేటిపై తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలెం కోటి ఆగ్రహం

**తాడ్వాయి మండలం డిడి9 వార్త రిపోర్టర్**

భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణకు కట్టుబడి ఉండాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలెం కోటి డిమాండ్ చేశారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు విఘాతం కలిగించే చర్యలను చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అమలులో ఉన్న 1/70 చట్టం, రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని ఆయన కోరారు. "దమ్ముంటే 1/70 చట్టం, ఐదో షెడ్యూల్ పరిధిలో సెంటు భూమి కొనుగోలు చేసి చూడండి. ఆదివాసీల హక్కుల కోసం మా పోరాటం ఏమిటో చూపిస్తాం" అని అలెం కోటి పేర్కొన్నారు. గిరిజనేతరులతో కోర్టుల్లో కేసులు వేయిస్తూ, మరోవైపు విలేకరుల సమావేశాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గిరిజన ఎమ్మెల్యేలను అడ్డుపెట్టుకొని 'జల్, జంగల్, జమీన్'పై ఆదివాసీలకు ఉన్న హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో కాంట్రాక్టులు, సీఎస్ఆర్ నిధుల విషయంలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతానికి అధికారులు రావాలన్నా రాజకీయ నాయకుల అనుమతి అవసరమనే పరిస్థితి ఉండకూడదన్నారు. గవర్నర్, రాష్ట్రపతి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల



రక్షణ కోసం రూపొందించిన చట్టాలు, జీవోలు పకడ్బందీగా అమలు కావాలని కోరారు. గోదావరి ఇసుక ర్యాంపుల కాంట్రాక్టులను ఇతర ప్రాంతాలకు చెందిన వారికి అప్పగిస్తున్నారని ఆరోపిస్తూ, ఈ వ్యవహారాల్లో ఆదివాసీల ప్రయోజనాలను విస్మరించవద్దని డిమాండ్ చేశారు. ఆదివాసీలు అమాయకులని భావించి వారి సహజ సంపదను దోచుకునే ప్రయత్నాలు చేస్తే సహించేది లేదన్నారు.ఆదివాసీల 'జల్, జంగల్, జమీన్'తో పాటు సహజ వనరులు, హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అలెం కోటి హెచ్చరించారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజాక్షేత్రంలో పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## నూతనంగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు అందించిన సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్

- పెన్షన్లు మంజూరు చేసిన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి వర్యులు డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క గారికి గ్రామ ప్రజల పక్షాన కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపిన సర్పంచ్ వంశావతి రమేష్

**డీ డీ 9 వార్త, ములుగు :**

వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామ పంచాయతీ ఆవరణం లో ఏర్పాటు చేసిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై 39 మందికి నూతనంగా మంజూరైన పించన్లు లబ్ధిదారులకు అందించిన సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్ గారు
ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు పెన్షన్ల కోసం 2022 నుండి ఎదురు చూస్తున్న తరుణం లో రాష్ట్ర మంత్రి వర్యులు డాక్టర్ సీతక్క గారు ప్రత్యేక చొరవ తీసుకొని మన గ్రామములో 39 మందికి పెన్షన్లు మంజూరు ఇప్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు
దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి పెన్షన్లు వస్తాయని ఆగస్ట్ లో మన రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క గారు రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందని ప్రజా ప్రభుత్వం లో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని మన గ్రామములో ఇంకా దరఖాస్తు చేసుకో వచ్చు అని ఆమె అన్నారు ఈ కార్యక్రమం లో కార్యదర్శి నాగరాజు ఉప సర్పంచ్ కొండ తిరుపతి వార్డు సభ్యులు పొన్నం మౌనిక రాము గజవేణి అనిత ధనుంజయ,మూడు లీల గణ్య,గోస్కుల వినయ్,అంతటి రాము కడివేండి తిరుపతి సీనియర్ నాయకులు బండ్ల రాజయ్య చిర్ర వీరస్వామి తో పాటు తదితరులు పాల్గొన్నారు.






## జీడీకే 1 అండ్ 3 గనిలో డీడీఎంఎస్ ఆకస్మిక తనిఖీ..!

- విద్యుత్ భద్రతా వ్యవస్థలపై క్షుణ్ణ పరిశీలన
- నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆదేశం

**పెద్దపల్లి బ్యూరో, జూలై 28 (డీడీ9 వార్త):**

రామగుండం ఏరియా 1 పరిధిలోని జీడీకే నెం.1 అండ్ 3 ఇంక్లైన్ గనిని డీడీఎంఎస్ సౌత్ సెంట్రల్ జోన్ అధికారి కోమల్ చౌదరి మంగళవారం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గనిలో అమలవుతున్న విద్యుత్ భద్రతా ప్రమాణాలు, పరికరాల నిర్వహణ, విద్యుత్ వ్యవస్థల పనితీరు, నాణ్యత ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.
తనిఖీలో భాగంగా ఫ్యాన్ హౌస్, ఇండోర్ స్విచ్ స్టేషన్, అవుట్ డోర్ సబ్‌స్టేషన్లు సందర్శించిన డీడీఎంఎస్ అధికారి విద్యుత్ పరికరాల నిర్వహణ విధానం, భద్రతా రక్షణ వ్యవస్థలు, నిర్వహణ రికార్డులు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు.ఈ సందర్భంగా గనుల్లో విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా నివారించాలంటే ప్రతి పరికరాన్ని నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలని, భద్రతా నిబంధనలను రాజీ లేకుండా అమలు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరా వ్యవస్థల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, రెగ్యులర్ ఇన్‌స్పెక్షన్లు, నివారణ చర్యలు, నిర్వహణ పనులను నిరంతరం కొనసాగించాలని అధికారులకు ఆదేశించారు.ఈ తనిఖీలో జీడీకే1 ఏజెంట్ ఎల్. రమేష్, డీజీఎం సేఫ్టీ పి. రమేష్, మైన్ మేనేజర్ సుధీర్ జక్కుల్వార్, సేఫ్టీ ఆఫీసర్ జి. మహేష్, పిట్ ఇంజనీర్ పి. శేఖర్, ఏఈ క్రాంతి, సర్వే ఆఫీసర్ ఐ. శ్రీనివాసు, వర్క్‌మెన్ ఇన్స్పెక్టర్ సంపత్ పాల్గొన్నారు. గనిలో అమలులో ఉన్న విద్యుత్ భద్రతా చర్యలు, నిర్వహణ విధానాలను డీడీఎంఎస్ అధికారికి వివరించారు.

## అధికారులసమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి...

- ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు..

**వెంకటాపురం, జూలై 28 (డీడీ9 వార్త):**

ములుగు జిల్లా వెంకటాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై మండల అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.
వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ముఖ్యంగా ఆరోగ్య శాఖ అధికారులు వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.
ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు ఎలాంటి ఆటంకాలు లేకుండా అందించాలని స్పష్టం చేశారు. అలాగే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులను ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల సాగుకు సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం జలసిరి అంశంపై సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు పాల్గొన్నారు.





## బ్యాంకు ముందే చెరువు.. ఖాతాదారుల నరకయాతన

- స్పందించని అధికారులు వృద్ధులు, మహిళలకు తీవ్ర ఇబ్బందులు
- వెంటనే సమస్య పరిష్కరించాలని సీపీఐ డిమాండ్

**పెద్దపల్లి బ్యూరో, జూలై 28 (డీడీ9 వార్త):**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖని విద్యానగర్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ముందు వర్షపు నీరు నిల్వ ఉండటంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం రిటైర్డ్ ఉద్యోగులతో కలిసి బ్యాంకు ముందు నిల్వ ఉన్న నీటిని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో బ్యాంకుకు వచ్చే ఖాతాదారులు లోపలికి వెళ్లేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు నీటిలో జారి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు.
ఈ సమస్యపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి, నిల్వ నీరు బయటకు వెళ్లేలా శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే బ్యాంకు అధికారులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో సమస్యను వెంటనే పరిష్కరించి ఖాతాదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ పరిశీలన కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు లక్ష్మీపతి, సుదర్శన్, బూడిద మల్లేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆసాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## గజ్వేల్ నుండి గెలిచి... టిఆర్ఎస్ అధ్యక్షులు కవితకు బహుమతిగా ఇద్దాం

- తెలంగాణ రక్షణ సేనలో ఉద్యమకారులకు పెద్దపీట...
- గజ్వేల్ అభివృద్ధి కోసం ప్రాణాలర్పించడానికి సిద్ధం...
- దేశంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన నియోజకవర్గం గజ్వేల్
- సామాజిక తెలంగాణ ఏర్పాటు టిఆర్ఎస్ అధ్యక్షులు కవిత లక్ష్యం...
- వ్యక్తిగత కక్షలతో గజ్వేల్ అభివృద్ధిపై నిర్లక్ష్యం చేయొద్దు...

**గజ్వేల్ జూలై 28 ( డీడీ9 వార్త ):-**

తెలంగాణ రక్షణ సేనలో ఉద్యమకారులకు పెద్దపీట వేస్తుండగా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ నుండి టిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి అధ్యక్షురాలు కవితకు బహుమతిగా ఇద్దామని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు, గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ స్పష్టం చేశారు. గజ్వేల్ నియోజకవర్గ పార్టీ ఇన్చార్జిగా నియమితులైన సందర్భంగా ఆయన మంగళవారం గజ్వేల్ లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సామాజిక తెలంగాణ లక్ష్యంగా ఏర్పడిన టిఆర్ఎస్ పార్టీ మహిళలు, యువత, ఎస్సీ, బీసీ, మైనారిటీ తదితర వర్గాలకు పెద్దపీట వేస్తూ ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. గజ్వేల్ లోని ఉద్యమకారులు ఆత్మ విమర్శ చేసుకోవాలని, ఏ ఒక్కరికి కూడా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ నేత కవితతో కలసి రావాలని, తద్వారా మనను నమ్ముకున్న పేద, బడుగు, బలహీన వర్గాలకు సంపూర్ణ న్యాయం చేయగలుగుతామని అన్నారు. ముఖ్యంగా దేశంలోనే గజ్వేల్ నియోజకవర్గం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉండగా, కెసిఆర్ పై ఉన్న వ్యక్తిగత కక్షతో సీఎం రేవంత్ రెడ్డి గజ్వేల్ అభివృద్ధిపై నిర్లక్ష్యం చేస్తున్నట్లు విమర్శించారు. అయితే గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పేరిట పేదల ఇండ్లను కూల్చివేయగా, వారికి ఇప్పటివరకు న్యాయం జరగ లేదని, ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషన్ల కోసం కట్టిన భవనాలు నిరుపయోగంగా ఉండగా, రూ కోట్లు వెచ్చించి నిర్మించిన రింగ్ రోడ్డు అందుబాటులోకి తేవడంలో నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఎద్దేవా చేశారు. పెరిగిన గజ్వేల్ జనాభాను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి చేయాల్సిన యంత్రాంగం పట్టించుకోవడం లేదని గుర్తు చేశారు. సామాజిక తెలంగాణ ఏర్పాటు టిఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల కవిత లక్ష్యం కాగా, గజ్వేల్ అభివృద్ధి కోసం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తూ ప్రాణాలు అర్పించడానికి సిద్ధమని ఆయన ప్రకటించారు. ఇందిరా పార్క్ చౌరస్తా నుండి కోట మైసమ్మ ఆలయం వరకు చేపట్టాల్సిన అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని, ఇందుకోసం స్థానిక కాంగ్రెస్ నేతలు చరవ చూపాలని డిమాండ్ చేశారు. అలాగే గజ్వేల్ అభివృద్ధిని కొన్ని వర్గాలు అడ్డుకుంటుండగా, పద్ధతి మార్చుకోని పక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు, నాయకులు నవీన్, కుమార్ అశోక్, రాజు, చందు, సురేష్, రమేష్, ప్రసాద్, నర్సింలు, నరేష్, శ్రావణ్, నాగరాజు, హరి, మిస్బా, రతిక్, అబ్బు పాల్గొన్నారు.



## సమ్మె సైరన్ మోగించిన ఏఐటీయూసీ..!

- మెడికల్ బోర్డుపై ఏఐటీయూసీ వాదనకు లేబర్ కమిషనర్ స్పందన
- ఆగస్టు 6లోపు డిమాండ్లపై నివేదిక ఇవ్వాలని లేబర్ కమిషనర్ సూచన
- చర్చలు ఫలించకపోతే ఆగస్టు 16 నుంచి నిరవధిక సమ్మె హెచ్చరిక

**పెద్దపల్లి బ్యూరో, జూలై 28 (డీడీ9 వార్త):**

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసుపై మంగళవారం హైదరాబాద్‌లో కేంద్ర కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ డా. సస్వతీ రాథ్ సమక్షంలో రెండో విడత చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో సింగరేణి యాజమాన్యం తరపున డిప్యూటీ జనరల్ మేనేజర్ బి. రాజగోపాల్ పాల్గొనగా, ఏఐటీయూసీ తరపున అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా సమ్మె నోటీసులో ప్రధాన డిమాండ్‌గా ఉన్న మెడికల్ బోర్డు అంశాన్ని ఏఐటీయూసీ బలంగా ప్రస్తావించింది. ఇటీవల నిర్వహించిన మెడికల్ బోర్డు పరీక్షల్లో కార్మికులను పారదర్శకంగా ఫిట్, అన్‌ఫిట్‌గా ప్రకటించలేదని, దీంతో అనేక మంది కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని యూనియన్ ప్రతినిధులు లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. యాజమాన్యం మాత్రం మెడికల్ బోర్డు ఇప్పటికే నిర్వహించామని వివరించింది.ఇరు పక్షాల వాదనలు విన్న అసిస్టెంట్ లేబర్ కమిషనర్ డా. సస్వతీ రాథ్, ఈ నెల 17, 18 తేదీల్లో మెడికల్ బోర్డు పరీక్షలకు హాజరైన కార్మికులకు రీమెడికల్ పరీక్ష నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని యాజమాన్యానికి సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి వివాదాలకు తావులేకుండా మెడికల్ బోర్డులను క్రమం తప్పకుండా నిర్వహించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా తదుపరి విచారణకు ముందు యాజమాన్యం, ఏఐటీయూసీ మధ్య ద్వైపాక్షిక సమావేశం నిర్వహించి సమ్మె నోటీసులో పొందుపరిచిన అన్ని డిమాండ్లపై సానుకూలంగా చర్చించాలని ఆదేశించారు. ఆ సమావేశంలో అంగీకరించిన అంశాలపై సమగ్ర నివేదికను ఆగస్టు 6న జరిగే తదుపరి విచారణలో సమర్పించాలని లేబర్ కమిషనర్ సూచించారు. నిర్ణయాధికారం కలిగిన ఉన్నతాధికారిని తప్పనిసరిగా హాజరు పరచాలని కూడా యాజమాన్యానికి స్పష్టం చేశారు.

**ఈ నేపథ్యంలో తదుపరి విచారణను ఆగస్టు 6కు వాయిదా వేశారు.**

ఈ సందర్భంగా ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ....ఆగస్టు 6న జరిగే చర్చల్లో కార్మికుల సమస్యలకు సానుకూల పరిష్కారం లభించకపోతే ఆగస్టు 16 నుంచి సింగరేణిలోని అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని నిరవధిక సమ్మె చేపడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, వై.వి. రావు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.




## గుండాల మండలంలో ఎస్ఐఆర్‌పై బీజేపీ సమీక్షసమావేశం.

- బూత్ స్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం
- రాష్ట్ర సభ్యులు పొడియం బాలరాజు.

**గుండాల, జూలై 28 (డి డి 9వార్త)**

గుండాల మండలంలోని 13, 12, 10, 9, 8, 7 మరియు 6 బూత్‌లలో ఎస్ఐఆర్ (SIR) అంశంపై బీజేపీ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో బూత్‌ల వారీగా జరుగుతున్న కార్యక్రమాలను సమీక్షించి, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.
ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర సభ్యులు మరియు గుండాల మండల ఇన్‌చార్జ్ శ్రీ పొడియం బాలరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, ప్రతి బూత్‌లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



ఈ సమావేశంలో జిల్లా సభ్యులు శ్రీను, బూత్ ఏజెంట్లు భట్టు, రమేష్, వట్టం నవీన్, జోగా నర్సింహారావు, ఇర్ప దేవరాజు, జీగాట సుధాకర్, ఈసం రవీందర్, మోకాళ్ల ఉపేందర్, మండల అధ్యక్షులు సొలం సతీష్, మండల ప్రధాన కార్యదర్శులు ఇర్ప ప్రకాష్, కల్తీ రాధాకృష్ణ, అలాగే బీజేపీ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశంలో రానున్న కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించి, బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# టీమిండియాలో కొత్త ముఖం.. వయసు 33.. ఎవరీ సారాంశ్ జైన్?

- 33 ఏళ్ల వయసులో తొలిసారి భారత టెస్టు జట్టుకు ఎంపికైన సారాంశ్ జైన్
- శ్రీలంకతో జరగబోయే టెస్టు సిరీస్‌కు సెలక్టర్ల నుంచి పిలుపు
- దేశవాళీ క్రికెట్‌లో నిలకడైన ప్రదర్శనతో గుర్తింపు
- వాషింగ్టన్ సుందర్ గాయపడటంతో దక్కిన అరుదైన అవకాశం
- తుది జట్టులో చోటు కోసం మానవ్ సుతార్‌తో తీవ్ర పోటీ



**డిడి9 వార్త :**

భారత క్రికెట్‌లో పట్టుదల, నిరంతర శ్రమకు ఫలితం ఎప్పటికైనా దక్కుతుందని మరోసారి రుజువైంది. దాదాపు దశాబ్ద కాలంగా దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నా గుర్తింపునకు నోచుకోని మధ్యప్రదేశ్ ఆల్ రౌండర్ సారాంశ్ జైన్, ఎట్టకేలకు 33 ఏళ్ల వయసులో తొలిసారి భారత టెస్టు జట్టు నుంచి పిలుపు అందుకున్నాడు. ఆగస్టులో శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో సెలక్టర్లు అతనికి చోటు కల్పించారు. ఎడమచేతి వాటం బ్యాటింగ్, కుడిచేతి వాటం ఆఫ్ స్పిన్ బౌలింగ్ చేసే సారాంశ్, టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను తన ఆరాధ్యుడిగా భావిస్తాడు.

**ఎవరీ సారాంశ్ జైన్?**

మధ్యప్రదేశ్‌కు చెందిన సారాంశ్ జైన్ తండ్రి సుబోధ్ జైన్ కూడా మాజీ ఫస్ట్‌క్లాస్ క్రికెటర్. తండ్రి స్ఫూర్తితో క్రికెట్‌లోకి అడుగుపెట్టిన సారాంశ్, 2014లోనే రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేశాడు. అయితే, సుదీర్ఘకాలం పాటు జట్టులో స్థానం కోసం పోరాడాల్సి వచ్చింది. 2022 వరకు కేవలం 8 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు మాత్రమే ఆడిన అతను, ఆ ఏడాది మధ్యప్రదేశ్ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించి వెలుగులోకి వచ్చాడు. నాకౌట్ దశలో 13 వికెట్లు పడగొట్టడమే కాకుండా, ఒక అర్ధ సెంచరీతో జట్టు విజయంలో తన వంతు సహకారం అందించాడు.

ఇక గతేడాది రంజీ సీజన్ అయితే అతని కెరీర్‌లోనే అత్యుత్తమంగా నిలిచింది. బ్యాటింగ్‌లో 57.55 సగటుతో 518 పరుగులు, బౌలింగ్‌లో 20.43 సగటుతో 30 వికెట్లు తీసి ఆల్ రౌండర్‌గా అద్భుత ప్రదర్శన కనబరిచాడు. దీనికి ముందు జరిగిన దులీప్ ట్రోఫీలో సెంట్రల్ జోన్ తరఫున కేవలం రెండు మ్యాచ్‌లలో 16 వికెట్లు, రెండు అర్ధ సెంచరీలు సాధించి "ప్లేయర్ ఆఫ్ ది సిరీస్" అవార్డును గెలుచుకున్నాడు. సారాంశ్ గత నెలలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టుకు నెట్ బౌలర్‌గా కూడా సేవలందించాడు.

**సెలక్షన్‌కు కారణం ఇదే**

రెగ్యులర్ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ తొడ కండరాల గాయంతో తొలి టెస్టుకు దూరం కావడంతో సెలక్టర్లు ప్రత్యామ్నాయం కోసం అన్వేషించారు. శ్రీలంక జట్టులో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఎక్కువగా ఉండటంతో, ఒక ఆఫ్ స్పిన్నర్ అవసరాన్ని గుర్తించారు. అదే సమయంలో సారాంశ్ జైన్ ఇటీవలే ఇండియాఏ జట్టుతో కలిసి శ్రీలంకలో పర్యటించాడు. అక్కడ తొలి మ్యాచ్‌లో సాధారణంగా రాణించినా, రెండో మ్యాచ్‌లో అజేయంగా 70 పరుగులు చేసి, 6 వికెట్లు పడగొట్టి తన ఎంపికకు మార్గం సుగమం చేసుకున్నాడు. ఈ ప్రదర్శనతో సెలక్టర్ల దృష్టిని బలంగా ఆకర్షించి, జాతీయ జట్టులో స్థానం దక్కించుకున్నాడు.

**అరంగేట్రం చేసే అవకాశాలు**

శ్రీలంక పిచ్‌లపై ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగాలని భారత జట్టు యాజమాన్యం భావిస్తోంది. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ తుది జట్టులో ఉండటం దాదాపు ఖాయం. మూడో స్పిన్నర్ స్థానం కోసం సారాంశ్ జైన్, యువ స్పిన్నర్ మానవ్ సుతార్ మధ్య పోటీ నెలకొంది. ఆఫ్ఘనిస్థాన్‌పై అరంగేట్రంలోనే 7 వికెట్లు తీసి సుతార్ ఆకట్టుకున్నాడు.

అయితే, జట్టులో ఇప్పటికే జడేజా రూపంలో ఒక లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ ఉన్నందున, మరొకరిని ఆడించేందుకు యాజమాన్యం మొగ్గు చూపకపోవచ్చు. శ్రీలంక బ్యాటింగ్ లైనప్‌లో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఎక్కువగా ఉండటం సారాంశ్‌కు కలిసొచ్చే అంశం. ఒకవేళ అతను తుది జట్టులో చోటు దక్కించుకుంటే, 1998లో రాబిన్ సింగ్ తర్వాత 33 ఏళ్ల వయసు దాటాక టెస్టు అరంగేట్రం చేసిన మరో భారత క్రికెటర్‌గా అరుదైన ఘనత సాధిస్తాడు.

# ఆ కుర్రాడిది బ్రాడ్‌మన్ టెక్నిక్.. అతడిని ఔట్ చేయడం కష్టం
# వైభవ్‌పై ఊతప్ప ఆసక్తికర వ్యాఖ్యలు

- టీమిండియా యువ బ్యాటర్ సూర్యవంశీని డాన్ బ్రాడ్‌మన్‌తో పోల్చిన రాబిన్ ఊతప్ప
- బ్రాడ్‌మన్‌లాగే వైభవ్‌ను కూడా ఎల్‌బీడబ్ల్యూ ఔట్ చేయడం చాలా కష్టమని వ్యాఖ్య
- బౌలర్లు అతడిపై ఎక్కువగా బాడీలైన్ బౌలింగ్ ప్రయోగిస్తున్నారని విశ్లేషణ
- అధిక స్ట్రైక్‌రేట్‌తో ఇదే ఫామ్ కొనసాగిస్తే వైభవ్ ఒక 'అవుట్‌లయర్' అవుతాడని అభిప్రాయం
- ధోనీలాగే తన సహజ శైలితో ఆడుతూ వైభవ్ ప్రత్యేకంగా నిలుస్తున్నాడని ప్రశంస



**డిడి9 వార్త :**

భారత క్రికెట్‌లో ప్రస్తుతం ఓ యువ సంచలనం పేరు మారుమోగిపోతోంది. అతడే వైభవ్ సూర్యవంశీ. ఇటీవలే జింబాబ్వేతో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచిన ఈ టీనేజ్ బ్యాటర్‌పై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ ఆటగాడు, ఐపీఎల్ విజేత రాబిన్ ఊతప్ప.. వైభవ్ బ్యాటింగ్ శైలిని ఏకంగా క్రికెట్ దిగ్గజం సర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్‌తో పోల్చి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడిన ఊతప్ప, వైభవ్ బ్యాటింగ్ టెక్నిక్‌లో బ్రాడ్‌మన్ ఛాయలు కనిపిస్తున్నాయని విశ్లేషించాడు. "బ్రాడ్‌మన్ ఆడుతున్నప్పుడు అతడిని కట్టడి చేసేందుకు బౌలర్లు బాడీలైన్ బౌలింగ్ ప్రయోగించేవారు. ఇప్పుడు వైభవ్ విషయంలోనూ అదే జరుగుతోంది. వీరిద్దరి టెక్నిక్‌లో ఒకేరకమైన పోలిక ఉంది. బ్రాడ్‌మన్‌లాగే వైభవ్‌ను కూడా ఎల్‌బీడబ్ల్యూగా ఔట్ చేయడం దాదాపు అసాధ్యం" అని ఊతప్ప వివరించాడు. వైభవ్ కెరీర్ ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నప్పటికీ, బౌలర్లు అతడిని ఎదుర్కోవడానికి ఇదే వ్యూహాన్ని అనుసరిస్తున్నారని పేర్కొన్నాడు.

అయితే, ఇప్పుడే ఒక అంచనాకు రావడం తొందరపాటు అవుతుందని ఊతప్ప అభిప్రాయపడ్డాడు. "బౌలర్లు వైభవ్ బ్యాటింగ్‌కు ఎలా స్పందిస్తారో చూడాలి. ప్రస్తుతానికి అతని ఆట తీరును అందరూ అర్థం చేసుకుంటున్నారు. వైభవ్ తన అద్భుతమైన స్ట్రైక్‌రేట్‌తో పాటు 40లలో బ్యాటింగ్ సగటును కొనసాగించగలిగితే, అతడు కచ్చితంగా ఒక 'అవుట్‌లయర్' (సాధారణ పద్ధతులకు భిన్నంగా అద్భుతంగా రాణించే ఆటగాడు) అవుతాడు" అని అన్నారు.

ఆధునిక క్రికెట్‌లో సాంప్రదాయ పద్ధతులకు భిన్నమైన ఆటగాళ్లు ఎక్కువగా రాణిస్తున్నారని ఊతప్ప తెలిపాడు. "ఇప్పుడు ఆటగాళ్లు సహజసిద్ధమైన ప్రతిభపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. అందుకే ఎంఎస్ ధోనీ తనదైన శైలితో విజయవంతమయ్యాడు. ఇప్పుడు వైభవ్ కూడా అదే చేస్తున్నాడు. భిన్నమైన టెక్నిక్‌లు ఇప్పుడు ఆమోదయోగ్యంగా మారాయి. అదే సమయంలో సచిన్ టెండూల్కర్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ వంటి వారి సంప్రదాయబద్ధమైన ఆటను కూడా మనం ఆస్వాదిస్తాం" అని ఊతప్ప చెప్పుకొచ్చాడు.

# యువ ఆటగాళ్ల ఆకలే మా బలం.. జింబాబ్వే సిరీస్ విజయం తర్వాత అయ్యర్

- జింబాబ్వేపై భారత్ 3-0తో క్లీన్‌స్వీప్
- యువ ఆటగాళ్లపై అయ్యర్ ప్రశంసలు
- మయాంక్ యాదవ్ ఆటతీరుపై ప్రత్యేక అభినందనలు
- వైభవ్ సూర్యవంశీ ఆరంభాలు కీలకమన్న కెప్టెన్
- ప్రతి ఆటగాడి సహకారమే విజయ రహస్యం
- తొలి టీ20 సిరీస్ విజయంపై ఆనందం



**డిడి9 వార్త :**

జింబాబ్వేపై టీ20 సిరీస్‌ను 30తో క్లీన్‌స్వీప్ చేసిన తర్వాత భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ యువ ఆటగాళ్లపై ప్రశంసలు కురిపించాడు. జట్టులో చోటు నిలబెట్టుకోవాలనే తపన, ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే ఆకలే జట్టు విజయానికి ప్రధాన కారణమని చెప్పాడు. టీ20 కెప్టెన్‌గా తన తొలి సిరీస్ విజయాన్ని అందుకోవడం ఎంతో ప్రత్యేకమైన అనుభూతినిచ్చిందని వెల్లడించాడు.

కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఐర్లాండ్‌పై రెండు, ఇంగ్లండ్‌పై నాలుగు మ్యాచ్‌లు వరుసగా ఓడిపోయామని అయ్యర్ గుర్తు చేశాడు. అయితే జింబాబ్వేపై వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి క్లీన్‌స్వీప్ చేయడం జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందన్నాడు. ఫలితాల గురించి కాకుండా జట్టుగా ఒక ప్రమాణాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా ఆడటంపైనే దృష్టి పెట్టామని వివరించాడు. యువ పేసర్ మయాంక్ యాదవ్‌ను అయ్యర్ ప్రత్యేకంగా ప్రశంసించాడు. మ్యాచ్‌లో ప్రతి బంతికి ముందు ఏం చేయాలని తనను అడిగేవాడని, నిర్ణయించిన ప్రణాళికను అద్భుతంగా అమలు చేశాడని కొనియాడాడు. అతడి వైఖరి, ఆటతీరు ఈ సిరీస్‌లో ప్రత్యేకంగా నిలిచాయని తెలిపాడు.

యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కూడా జట్టుకు అద్భుతమైన ఆరంభాలు అందించాడని అయ్యర్ చెప్పాడు. తొలి రెండు మ్యాచ్‌ల్లో అతడు ఇచ్చిన శుభారంభం జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిందన్నాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్, తిలక్ వర్మ కూడా తమవంతు బాధ్యతను నిర్వర్తించారని పేర్కొన్నాడు. ప్రతి ఆటగాడు తన పాత్రను సమర్థంగా పోషించినప్పుడే విజయాలు సాధ్యమవుతాయని, జింబాబ్వే సిరీస్‌లో అదే జరిగిందని అయ్యర్ అభిప్రాయపడ్డాడు.

## వద్దిపేట చెక్ డ్యామ్ నిర్మాణం చేపట్టాలని వినతి పత్రం

**చర్ల, జూలై 28 (డిడి 9 వార్త)**

చర్ల మండలంలో మంగళవారం పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఎత్తిపోతల పథకం కింద చర్ల మండలంలోని వద్దిపేట చెక్ డ్యామ్ నిర్మాణం చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అధికారంలోకి వచ్చే ముందు చర్ల మండలంలో ఆదివాసీలు సాగు చేసుకునే 25వేల ఎకరాల పంట భూములకు వద్దిపేట చెక్ డ్యామ్ ద్వారా ఎత్తిపోతల పథకం కింద నీళ్లు అందిస్తానని హామీ ఇచ్చారని కానీ నిలబెట్టుకోలేకపోయారని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వద్దిపేట చెక్ డ్యామ్ నిర్మించి ఆదివాసీ రైతులకు నీళ్లు అందించాలని అన్నారు.యావత్తు ప్రపంచానికి అన్నం పెట్టే రైతన్నకు రెండు పంటలు పండించుకోవడానికి నీళ్లు అందించడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని, దశాబ్దాలు గడిచిపోతున్న చెక్ డ్యామ్ నిర్మాణం గురించి పట్టించుకోకపోవడం చాలా దుర్మార్గమని ఆయన అన్నారు. చర్ల మండలంలో ఉన్న రైతులకు రెండు పంటలకు నీళ్లు అందించే విధంగా పాలకులు ఎత్తిపోతల పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిధులు తీసుకొచ్చి చెక్ డ్యామ్ పనులు మొదలు పెట్టాలని ఆయన అన్నారు. తక్షణమే ఎత్తిపోతల పథకం కింద చర్ల మండలంలో సాగులో ఉన్న 25 వేల ఎకరాలకి సాగు నీరు అందించాలని, ఎమ్మెల్యే మొట్టమొదట ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీగా డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనియెడల చర్ల మండలం లో ఉన్న రైతులందరినీ ఐక్యం చేసుకొని ఉద్యమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాం కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు, ప్రజలు రైతులు తదితరులు పాల్గొన్నారు.



## మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం

**జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నళిని శ్రీ**

**బోనకల్,జూలై 28,(డీడీ9 వార్త)**

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటడం జరిగింది. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హరితహారం ప్రోగ్రాం ను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నళిని శ్రీ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమం ఎంతో గొప్పదనీ, పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత చెట్లు మనకు ప్రాణ వాయువును,నీడ,వర్షాలు,స్వచ్ఛమైన గాలి మరియు పర్యావరణ సమతుల్యతను అందిస్తాయి అందుకే ఒక మనిషి ఒక మొక్క అనే భావనను ప్రతి ఒక్కరూ ఆచరించాలి నేటి కాలంలో పెరుగుతున్న కాలుష్యం అడవుల నరికివేత వాతావరణ మార్పులు వంటి సమస్యలకు చెట్లు పెంపకం ఒక ముఖ్యమైన పరిష్కారం మనము నాటే ప్రతి మొక్క భావితరాలకు అమూల్యమైన సంపద అని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవా భావంతో సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు,ఒక మొక్కను నాటి అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. కళాశాల రాజనీతి ఆధ్యాపకులు జోనతాన్ బాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఎన్ఎస్ఎస్ యూనిట్ కి అభినందనలు తెలియజేశారు. లైబ్రరీన్ మోహన్ మాట్లాడుతూ వాలంటీర్స్ తో స్లొగన్స్ ని చెప్పించడం జరిగింది.చెట్లు నాటుదాం ప్రకృతిని కాపాడుదాం,

**పచ్చని చెట్లు - ప్రగతికి మెట్లు**

హరితహారం లక్ష్యాలను విజయవంతం చేయడానికి మనందరం కృషి చేద్దామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంతోటి. తిరుపతి రావు, అధ్యాపకులు రాజేంద్ర కుమార్, లక్ష్మీకాంతం, పద్మావతి, రామకృష్ణ, రమేష్, రాజేంద్ర, ప్రియ కుమార్ రెడ్డి, మురళీకృష్ణ, శాంతి ప్రియ, యశోద, యూ డి సి మదర్ సాహెబ్, జశ్వంత్, బుజ్జమ్మ,అరుణ,ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.




## ప్రైవేట్ స్కూల్ బస్సును ఢీకొట్టిన ఆర్టీసీ అద్దె బస్సు

- జగిత్యాలలో తప్పిన పెను ప్రమాదం..
- నలుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలు.. క్షేమంగా బయటపడిన చిన్నారులు



**జగిత్యాల టౌన్, డిడి9 వార్త**

జగిత్యాల పట్టణంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. పట్టణంలోని యావర్ రోడ్డులో కాంతి భవన్ సమీపంలో రోడ్డు దాటుతున్న ఓ ప్రైవేట్ పాఠశాల బస్సును అదే మార్గంలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో భయాందోళనలు నెలకొన్నాయి.ప్రైవేట్ పాఠశాల బస్సులో సుమారు 20 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులో ఉన్న చిన్నారులు భయంతో ఆందోళనకు గురయ్యారు. స్థానికులు, ప్రయాణికులు వెంటనే స్పందించి విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలు అయినట్లు సమాచారం. వారికి ప్రాథమిక చికిత్స అందించినట్లు తెలిసింది. ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు.ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులు సంఘటన స్థలానికి చేరుకుని చిన్నారుల పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రమాదం కారణంగా కొంతసేపు యావర్ రోడ్డుపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు.బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యమా, లేక ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఈ ఘటనలో పెద్ద ప్రమాదం తప్పిపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాల బస్సులు విద్యార్థులను తీసుకెళ్లే సమయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని స్థానికులు సూచిస్తున్నారు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.